


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 12-04-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 208 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## రాజీనామాలు కావవి.. ప్రజలకు నామాలు

- టీడీపీ సహకారంలేకుంటే భాజపా ఎక్కడిది?
- వైకాపా తీరుపై చంద్రబాబు ఘాటైన విమర్శ
- మోదీ దీక్ష చేస్తాననడం విడ్డూరం
- జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాల్లో సీఎం బాబు

విజయవాడ: వైకాపావి రాజీనామాలు కాదని, భాజపాతో రాజీపడి ప్రజలకు నామాలు పెట్టారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. తన మీద కక్షతో రాష్ట్రం మీద దాడి చేసే పరిస్థితికి భాజపా వచ్చిందని సీఎం మండిపడ్డారు. తెలుగుదేశం సహకారం లేకుంటే రాష్ట్రంలో భాజపా ఎక్కడుందని ప్రశ్నించారు. విజయవాడ మున్సిపల్ స్టేడియంలో జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రయోజనాల కోసం మనం రాజీ పడబోమని భాజపాకు అర్థమైనందునే కేసులున్న వారిని చేరదీశారని విమర్శించారు. అలా చేరదీస్తే తమ చెప్పుచేతల్లో జగన్ ఉంటాడన్నది భాజపా ఎత్తుగడ అని వివరించారు. కక్ష సాధింపు కోసం అవినీతి



పార్టీని భాజపా అక్కున చేర్చుకుందన్న చంద్రబాబు ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. హక్కుల సాధన కోసం ప్రధాని ఇంటిని తరువాయి 2లో

## ప్రాణాలైనా తెగిస్తాం.. హోదా సాధిస్తాం..

- ఎంపీలకు బలవంతంగా ఫ్లూయిడ్స్
- ఆరోగ్యం క్షీణించిన మిధున్, అవినాష్
- ఆమరణ నిరాహార దీక్ష భగ్నం
- పోలీసుల రంగప్రవేశం.. ఆస్పత్రిలో చేర్పింపు
- షుగర్ లెవెల్స్ తగ్గిన ఎంపీలను ఆసుపత్రికి తరలింపు

న్యూఢిల్లీ: నిరాహార దీక్షలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మిథున్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను బలవంతంగా ఆస్పత్రికి తరలించినా.. వైద్యం చేయించుకునేందుకు నిరాకరించారు. గత ఆరు రోజులుగా దీక్ష చేస్తున్న మిథున్, అవినాష్‌ల ఆరోగ్యం విషమించడంతో వారిని బుధవారం రాంమనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. ఆస్పత్రిలో ఎంపీలకు ఫ్లూయిడ్స్ ఎక్కించేందుకు వైద్యులు ప్రయత్నించినా.. అందుకు వారు నిరాకరించారు. దీక్ష కొనసాగించాలన్న సంకల్పాన్ని ప్రదర్శించారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ తరువాయి 2లో







## మృత్యు లోహవిహంగం

**అల్జీరియాలో ఘోర విమాన ప్రమాదం 257మంది మృతి** || **ఘటనా స్థలికి చేరుకున్న భద్రతా సిబ్బంది రక్షణ శాఖ అధికార ప్రతినిధి**

అల్జీర్స్: అల్జీరియాలో సైనిక విమానం ఘోర ప్రమాదానికి గురైంది. సైనిక సిబ్బందితో ప్రయాణిస్తున్న విమానం కుప్ప కూలింది. అల్జీర్స్ సమీపంలోని బౌఫారిక్ విమానాశ్రయానికి సమీపంలోనే కూలిపోగా 257 మంది చనిపోయారని స్థానిక టీవీ వెల్లడించింది. అయితే మృతుల సంఖ్యపై అధికారులు తరువాయి 2లో

## మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి

ఇది రాష్ట్ర ప్రజల ఆకాంక్ష - సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నారు
టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ ఫ్లోర్ లీడర్లు
జిల్లాలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్: రాబోయే 2019 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమపథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి క్రమాన్ని చూసే పలువురు తరువాయి 2లో



## దక్షిణాది రాష్ట్రాల ఆరోపణల్ని తోసిపుచ్చిన జైట్లీ



దిల్లీ: 15వ ఆర్థిక సంఘం నిబంధనల రూపకల్పనలో ఒక ప్రాంతం పట్ల ఎలాంటి పక్షపాతం చూపలేదని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. కేంద్రం రూపొందించిన నిబంధనావళిని తప్పుబడుతూ దక్షిణాది రాష్ట్రాల మంత్రులు చేసిన ఆరోపణల్ని తోసిపుచ్చుతూ ఆయన ఫేస్‌బుక్‌లో వ్యాసం రాశారు. రాష్ట్రాల్లోని జనాభాకు తగిన అవసరాలు, జనాభా నియంత్రణలో సాధించిన పురోగతి మధ్య సమతుల్యం పాటించేలా నిబంధనలు రూపొందించినట్లు వెల్లడించారు. 15వ ఆర్థిక సంఘం నిబంధనలు ఒక ప్రాంతానికి వ్యతిరేకంగా ఉన్నాయంటూ అనవసర వివాదం సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆయా వాదనల్లో ఎలాంటి నిజం లేదని జైట్లీ స్పష్టం చేశారు. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు, పేద రాష్ట్రాలకు ఎక్కువ నిధులు వచ్చేలా నిబంధనలు రూపొందించినట్లు వివరించారు. పన్నుల ఆదాయం పంపానికి 1971 జనాభా లెక్కలకు బదులుగా 2011 లెక్కల్ని ప్రాతిపదికగా తీసుకోవడాన్ని జైట్లీ సమర్థించుకున్నారు. 14వ ఆర్థిక సంఘం 2011 లెక్కల్ని పరిగణనలోకి తీసుకుని పన్నుల ఆదాయంలో రాష్ట్రాల వాటాను 42 శాతానికి పెంచిందని గుర్తు చేశారు.

పన్నుల ఆదాయం పంపిణీకి 2011 జనాభా లెక్కల్ని ప్రాతిపదికగా తీసుకోవడం పట్ల మంగళవారం తిరువనంతపురంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సదస్సు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. పన్నుల ఆదాయం పంపిణీకి 1971 జనాభా తరువాయి 2లో

## నేడు వర్సిటీకి రానున్న ఉపరాష్ట్రపతి

పూర్వ విద్యార్థి, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఆంధ్ర విశ్వ విద్యాలయంః ఏయూకి నేడు భారత ఉప రాష్ట్రపతి, ఆంధ్ర విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థి ఎం.వెంకయ్య నాయుడు రానున్నారు. సాయంత్రం 5.20 గంటలకు ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుని అక్కడ నూతనంగా నిర్మించిన ప్రయోగ శాలలను ప్రారంభిస్తారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్మించి ప్రయోగశాలలను ఆయన ప్రారంభించి, ఆయన అక్కడే కొద్దిసేపు ఉంటారు.

13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఏయూ ఆంగ్ల మాధ్యమం కార్యక్రమంలో నిర్వహించే కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ఎం.వెకయ్య నాయుడు పాల్గొంటారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ప్రయోగశాల, ఆర్ఓ వాటర్ ప్లాంట్‌లను ఆయన ప్రారంభిస్తారు. అనంతరం విద్యార్థుల సాంసృతిక ప్రదర్శనలను తిలకించి, విద్యార్థులనుద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తారు.

## ప్రత్యేక హోదా, రైల్వే జోన్ కోరుతూ రైల్‌రోకో నిర్వహణ

- విభజ చట్టంలో హామీలు అమలు చేయాలి
- ప్రధాని మాట నిలబెట్టుకోవాలి
- వైకాపా నిర్వహించిన రైల్‌రోకో సక్సెస్
- పోలీసు వలయంలో రైల్‌రోకో

విశాఖపట్నంః ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైల్వే జోన్ ప్రకటించాలని, ఏపీకి ప్రత్యేక హెూదా ఇవ్వాలని కోరుతూ విశాఖ నగర రైల్వే స్టేషన్‌లో నగర వైకాపా నేతలు బుధవారం రైల్‌రోకో నిర్వహించారు. ఇందులో భాగంగా పలాస పాసింజర్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వైకాపా నేతలైన మళ్ళ విజయప్రసాద్, తైనాల విజయకుమార్, గుడివాడ అమర్‌నాధ్, వంశీకృష్ణ శ్రీనివాస్, కోలా గురువులు, జాన్ వెస్లీ, తిప్పల నాగిరెడ్డి, సత్తి రామకృష్ణా రెడ్డి, పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు ప్లాట్‌ఫారంపై ప్రవేశించి విశాఖ - పలాస పాసింజర్ రైలింజన్ ముందు భాగాన్ని ఎక్కి వైకాపాతోనే ప్రత్యేక హక్కు తరువాయి 2లో





# ఇక సాగునీటి ప్రాజెక్ట్‌గా తాటిపూడి జలాశయం



విజయనగరం: జిల్లాలోని తాటిపూడి జలాశయం నీటిని సాగుకు వినియోగించాలా? లేక తాగుకి వినియోగించాలా? అన్న వివాదానికి సుప్రీం కోర్టు తీర్పుతో తెరపడింది. పిల్లిపోరు, పిల్లిపోరు పిట్టతీర్చిందన్న చందంగా అటు ప్రజలు, ఇటు రైతులు మధ్య తలెత్తిన తాటిపూడి జలాశయం నీటి వినియోగం సమస్యకు దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ పరిష్కరించినట్లయింది. నిన్న మొన్నటి వరకు తాటిపూడి జలాశయం నీటిని వినియోగించే విషయమై పలు వివాదాలు చోటుచేసుకున్నాయి. ఇదే అదునుగా రాజకీయ నాయకులు సైతం ఈ వివాదానికి మరింత అజ్యంపోస్తూ వచ్చారు. ఇంకోవైపు పలు సామాజిక వర్గాలు సైతం నీటి వినియోగంపై తమవంతు ప్రయత్నం చేశారు. చివరికిదీ సాగునీరా, త్రాగునీరా అన్న మీమాంసలో పడిపోయింది.

***సమస్య ఈనాటిది కాదు :***

తాటిపూడి జలాశయం నీటి సమస్య ఈనాటిది కాదు. తాటిపూడి జలాశయాన్ని నిర్మించిన సందర్భంలోనే సాగునీటికి, తాగునీటికి కేటాయింపులు జరిగాయి. తాటిపూడి ఆయకట్టు ప్రాంతంలో రైతులకి నీరు అందిస్తూనే సమీపంలోని విశాఖమహానగరానికి త్రాగునీటిని సరఫరా చేసేలా సర్దుబాటు జరిగింది. ఒక విధంగా చెప్పాలంటే విశాఖ మహానగరం తాటిపూడి జలాశయం నీటిపైనే ఆధారపడివుంది. మరోవైపు ఈ జలాశయం నీటిని సాగుకే తప్ప త్రాగుకు వినియోగించరాదన్న అభిప్రాయాన్ని ఆయకట్టురైతులు వ్యక్తం చేస్తూ వచ్చారు. ఒకానొక సందర్భంలో దీనిపై ప్రచ్ఛన్న పోరుకూడా జరిగింది. ఇంతలో సమీపంలోని విజయనగరం పట్టణానికి కూడా మంచినీటి సరఫరాకు ఈ జలాశయమే ప్రధాన వనరైంది. తాటిపూడి గ్రామానికి దగ్గరలో వున్న ముసిడిపల్లివద్ద గోస్తనీ నదిలో ఊటబావులను నిర్మించడం ద్వారా తాగునీటిని విజయనగరం పట్టణానికి సరఫరా చేసే పథకం 15 సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. ఈ పథకం ప్రారంభంలోనే ఆయకట్టురైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ముసిడిపల్లి నుంచి ఊటబావులు ద్వారా తాటిపూడి జలాశయం అనుకుని వున్న కొండపైకి నీటిని తీసుకొచ్చేవారు. అక్కడ నుంచి గురుత్వాకర్షణ సూత్రం ఆధారంగా విజయనగరానికి నీటిని సరఫరా చేసేవారు. తాటిపూడి నుంచి విజయనగరానికి వెళ్లే రహదారి మధ్యలో పలువురు రైతులు నీటిగొట్టాలను పగలుగొట్టిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఎండాకాలంలో ఊటబావులు సైతం నీరులేక ఎండిపోయేవి. ఈ పరిస్థితుల్లో తాటిపూడి జలాశయం గేట్లను కొంచెం ఎత్తడం ద్వారా నీటిని నదిలోకి వదిలేవారు. చివరికి ఈ ప్రక్రియను కూడా ఆయకట్టు రైతులు అడ్డుకోవడం జరిగింది. ఎన్నివిధాలా నచ్చచెప్పినా ఆయకట్టు రైతులు జలాశయం నీటిని త్రాగుకి ఉపయోగించేందుకు అంగీకరించలేదు.

***మంత్రి గంటా ఆదేశాలు :***

ఈనేపథ్యంలో అనూహ్యంగా ఇటీవలనే మంత్రి గంటా శ్రీనివాసరావు తాటిపూడి జలాశయం విషయంలో చొరవ చూపారు. అంటే తాటిపూడి జలాశయాన్ని సాగునీటి ప్రాజెక్టుగా మార్చేదిశగా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తాటిపూడి జలాశయంలో ఎంత నీరు లభ్యమవుతోంది, వినియోగిస్తున్న నీటిశాతం ఎంత అన్నదానిపై వివరాలు ఇవ్వాలని నీటిపారుదల ఇంజనీర్లను ఆదేశించారు. ఈమేరకు అధికారులు ప్రణాళిక రూపకల్పన చేయడంలో నిమగ్నమయ్యారు. తద్వారా ఆయకట్టు ప్రాంతాన్ని విస్తరించే ఉద్దేశ్యం కూడా కనిపిస్తోంది. అధికారుల అంచనా చేతికి అందిన తరువాత తాటిపూడి జలాశయాన్ని సాగునీటి ప్రాజెక్టుగా ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదే అభిప్రాయాన్ని జిల్లాకు చెందిన ఒకరిద్దరు శాసనసభ్యులు కూడా ఇటీవల జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో కోరినట్లు సమాచారం. దరిమిలా తాటిపూడి జలాశయాన్ని సాగునీటి వనరుగా మార్చేందుకు రంగం సిద్దమైంది.

***'సుప్రీం' బ్రేక్ :***

ఈపరిస్థితులలో దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కీలకంగా మారింది. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య జలవివాదాన్ని సృష్టించిన కావేరినది జలాల విషయమై సుదీర్ఘకాలం సుప్రీంలో విచారణ సాగింది. దీనిపై తీర్పును ఇటీవల సుప్రీం కోర్టు ప్రకటించింది. ఈకేసు నేపథ్యంలో నీటిపారుదల ప్రాజెక్టులలో తాగునీటికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్న విషయాన్ని సుప్రీం స్పష్టం చేసింది. నిజానికీ మనిషి బ్రతికివుంటేకదా వ్యవసాయమైనా మరేదైనా. ముందు మనిషికి తాగేందుకు గుక్కెడు నీళ్లు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కాబట్టి సాగునీటి ప్రాజెక్టులలో మొదటి ప్రాధాన్యత త్రాగునీరేనని ముగ్గురు న్యాయమూర్తుల దర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో తాటిపూడి జలాశయాన్ని సాగునీటి ప్రాజెక్టుగా ప్రకటించాలన్న ఆలోచనకు బ్రేక్ పడినట్లయింది. ఇప్పుడు అటు విశాఖ మహానగరానికి, ఇటు విజయనగరం పట్టణానికి ముందుగా తాగునీటి సరఫరాకు అవకాశం కల్పించేందుకు మార్గం సుగమమైంది.



## మొదటి పేజీ తరువాయి

### ప్రాణాలైనా తెగిస్తాం.. హోదా సాధిస్తాం

నేతలు, మీడియాను పోలీసులు బయటకు పంపించారు. దీంతో లోపల ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఆర్ఎంఎల్ ఆస్పత్రి సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో ప్రస్తుతం ఎంపీలు మిథున్, అవినాష్ ఉన్నారు. దీక్షతో ఆరోగ్యం తీవ్రంగా విషమించిన కారణంగా ఫ్లూయిడ్స్ ఎక్కించుకోవాలని వైద్యులు ఎంపీలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు వినిపించుకోకపోవడంతో బలవంతంగా ఫ్లూయిడ్స్ ఎక్కించారు.

### మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి

టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. మంత్రి కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదట తంగళ్లపల్లిలోని మైనార్టీ గురుకుల వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. తర్వాత స్థానిక కార్తికేయ దవాఖానను ప్రారంభించారు. ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ ఇంట్లో తేనీటి విందుకు హాజరయ్యారు. అనంతరం సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు భారీసంఖ్యలో కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎక్కడ చూసినా ప్రజలు నిండు మనసుతో ఆదరిస్తున్నారని చెప్పారు. ఇటీవల వివిధ జిల్లాలో పర్యటించామని, అంతటా ఒకేరకమైన ట్రెండ్ కనిపిస్తున్నదని పేర్కొన్నారు.

కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రం అభివృద్ధివైపు పరుగులు పెట్టాలన్నదే ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి అన్నిపార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులై పెద్దసంఖ్యలో టీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. రాజకీయాల్లో శత్రుత్వాలు శాశ్వతం కాదని, గతకాలంలో ఎన్ని వైరుధ్యాలు ఉన్నా కలిసి మెలిసి ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధికోసం పాటుపడాలని కార్యకర్తలకు హితవు పలికారు. సమైక్య పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏండ్ల తరబడి నత్తనడక నడిచిన మధ్య మానేరు ప్రాజెక్టును పూర్తిచేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు.మధ్యమానేరు జలాశయం నుంచి గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరుకు ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరు అందించి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పునరుద్ఘాటించారు. రైతుబంధు పథకం ద్వారా వచ్చే పంటకు ఎకరానికి రూ.4వేలు అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు.

### మృత్యు లోహవిహంగం

ధ్రువీకరించాల్సి ఉంది. విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఈ ప్రమాదం జరిగింది. విమానం కూలిన చోట పెద్ద ఎత్తున దట్టమైన నల్లని పొగలు ఎగిసిపడినట్లు స్థానిక టీవీ దృశ్యాలను ప్రసారం చేసింది. అత్యవసర సేవల సిబ్బంది, భద్రతా సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నారు.

విమానం బౌఫారిక్ నుంచి బెచర్ నగరంలోని వైమానిక స్థావరానికి బయల్దేరగా ఈ ప్రమాదం జరిగింది. విమానంలో ప్రయాణిస్తున్న వారు సైనికులని దేశ రక్షణ శాఖ స్పష్టంచేసింది. మరణించిన వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేసింది. వంద మందకి పైగా మరణించారని, ప్రస్తుత పరిస్థితుల్లో కచ్చితమైన సంఖ్య చెప్పలేమని రక్షణ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. సైనిక రవాణా శాఖకు చెందిన ఈ విమానం వ్యవసాయ భూముల్లో పడిపోయిందని, అయితే ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేరని వెల్లడించారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదని, ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని రక్షణ శాఖ తెలిపింది.

### దక్షిణాది రాష్ట్రాల ఆరోపణల్ని తోసిపుచ్చిన జైట్లీ

లెక్కల్నే ప్రాతిపదికగా తీసుకోవాలని సదస్సు డిమాండ్ చేసింది. అలా చేయకపోతే దక్షిణాది రాష్ట్రాలు భారీగా నష్టపోతాయని, జనభా పెరుగుదల రేటును విజయవంతంగా తగ్గించిన రాష్ట్రాల్ని శిక్షించడం తగదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభిప్రాయపడ్డారు. జీఎస్టీ అమలు సహా జీఎస్టీ ఆదాయాన్ని సమానంగా పంచడం వల్ల రాష్ట్రాలు చాలా వరకు ఆర్థిక వనరుల్ని కోల్పోయాయన్నారు. పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 42 శాతం కన్నా ఎక్కువ పెంచే అంశాన్ని పరిశీలించాలని ఆయన కోరారు.

### ప్రత్యేక హోదా, రైల్వే జోన్ కోరుతూ రైల్‌రోకో నిర్వహణ

సాధ్యం అంటూ నినదించారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని కోరుతూ నినదించారు. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి అందరినీ చుట్టుముట్టారు. ఇందులో భాగంగా రైల్వే పోలీసులు, ఆర్పిఎఫ్ బలగాలు, జిఆర్పి పోలీసులు వారిని చెదరగొట్టారు. రైల్‌రోకో సక్సెస్ అనంతరం వైకాపా నేతలు మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలలో ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం బిల్లును ప్రధాని చర్చకు రానీయకుండా సమావేశాలను వాయిదా వేయించారంటూ నిరసించారు. ఆనాడు విభజన చట్టంలో ఇచ్చిన అంశాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఢిల్లీలో వైకాపా నేతలు హోదా సాధన కోసం అమరణ నిరాహార దీక్ష చేస్తుంటే వారిని బలవంతంగా పోలీసులు లాక్కెళ్లి దీక్షను భగ్నం చేయడాన్ని నిరసించారు. ప్రభుత్వానిది ఇదేమి తీరని ప్రశ్నించారు. ప్రాణాలు పణంగా పెట్టైనా హోదా సాధిస్తామని వైకాపా నేతలు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి హోదాపై మాట్లాడకుండా అక్కడ అఖిలపక్ష సమావేశం పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. యూటర్న్ అంకుల్ అని బాబుకు పేరు పెట్టడం సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్య ప్రసాదరెడ్డి, గరికిన గోరి, బోని శివరామకృష్ణ, షరీఫ్, బర్కత్ అలీ, బొడ్డేటి నాగు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### రాజీనామాలు కావవి.. ప్రజలకు నామాలు

ముట్టడించిన ఘనత తెదేపా ఎంపీలదన్నారు. కర్ణాటక ఎన్నికల కోసం కావేరి బోర్డు వేయకుండా అన్నా డీఎంకేతో పార్లమెంట్‌లో గొడవ చేయించారని దుయ్యబట్టారు. వెంకటేశ్వరస్వామి సాక్షిగా మోదీ చేసిన వాగ్దానాలను తాము ప్రశ్నిస్తుంటే.. తామేదో తప్పు చేసినట్లు మోదీ దీక్ష చేస్తాననడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. ఎలాంటి త్యాగాలు, పోరాటాలకైనా తాము సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 25 ఎంపీ స్థానాలు గెలవడమే మన లక్ష్యమన్న చంద్రబాబు అప్పుడే మన మాట వినే ప్రభుత్వం కేంద్రంలో వస్తుందన్నారు. తద్వారా ప్రత్యేక హోదా కూడా వస్తుందన్నారు.

# చంద్రన్న బీమా పరిహారం అందచేత



భీమునిపట్నం: 27 వార్డు సంగివలస గ్రామం లో నిన్న ప్రమాదం లో ఇటివల మరణించిన ఊల్ల అమ్మాజమ్మ కి చంద్రన్న బీమా రెండు లక్షల బాండును ఆమె భర్త ఊల్ల నరసింగరావుకు భీమిలి, టి.డి.పి.జోన్ అధ్యక్షులు గంటా.నూకరాజు, అందజేసారు.. గంటా.నూక రాజు మాట్లాడుతూ చంద్రన్న భీమా ప్రతీ వ్యక్తి భరోసాగా నిలుస్తూ పేద ప్రజల ఆశాజ్యోతిగా నారా చంద్రబాబు నాయిడు చరిత్రలో నిలిచిపోతారని అన్నారు,ఈ కార్యక్రమం లో కాసరపు.నాగరాజు,పి.యోగి , ఊల్ల .దుర్గారావు, గిడుతూరి.శ్రీనివాసరావు, రమణ పైడిరాజు,సి.హెచ్ పార్వతి,కోలా అప్పలకొండ, ఎ.పి.డి.బంగారు రాజు చంద్రన్న ,మా మిత్ర సభ్యురాలు పోతిన .వెంకటలక్ష్మి, తదీతరులు పాలుగున్నారు.

# భవిత కేంద్రంలో ఆటిజంపై అవగాహన సదస్సు




భీమునిపట్నం: స్థానిక భవిత కేంద్రంలో అటిజం అవగాహనా కార్యక్రమం ర్యాలి నిర్వహించారు . ఈ సందర్భంగా మద్దిలపేట హెచ్.ఎం.రమేష్ మాట్లాడుతూ ఇటువంటి పిల్లలను ప్రేమతో చేరదీసి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని,తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వీరిపై విసుగు కోపం ప్రదర్శంచకుండా ఉండడం వలన వీరి ప్రవర్తన లో మార్పు వస్తుందని తల్లిదండ్రులను సూచించారు.ఆడపిల్లలతో పోలిస్తే మగ పిల్లలో ఈ అటిజం కనిపిస్తుంది నాడీ వ్యవస్థ లో లోపం వల్ల ఏర్పడే మానసిక స్థితిని అటిజం అంటారని అటిజం లక్షణాలు కలిగిన పిల్లలు చేసిందే మల్లీ మల్లీ చేస్తుండం ఒక పనిని ఎప్పుడు చేసినా తిరిగి అలాగే చేయడానికి ప్రయత్నం చెయడం ఒంటరిగా ఉండ డానికి ఇష్టపడడం చేస్తారు .ఇతర పిల్లలతో కల్వలేకపోతుండం చేతులను కాళ్ళను అదే పని గా అడిస్తారని ఆయన వివరించారు . ఐ.ఇ.ఆర్.టి.డబ్ల్యు. కెజియకుమారి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2008 లోమానసిక వైకల్యం తో బాధపడే ఆటిజం చిన్నారులను ప్రపంచం నకు తెలియజెప్పాలనే,అటిజం పై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యం తో ఏప్రెల్ రెండు న ప్రపంచ అటిజం దినోత్సవం గా ఈనెల ను అటిజం నెలగా పేర్కొన్నారు. ఈ సమావేశం లో విజయరాంపురం హెచ్. ఎం. రవి నాగేశ్వరరావు.పాత పరదేశిపాలెం హెచ్.ఎం రామకృష్ణ ఎస్.ఎస్.ఎస్.కుమారి, ఐ.ఇ.ఆర్.టి. డబ్ల్యు సభ్యులు సి.ఆర్.పి. సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భీమిలిలో రోడ్ల విస్తరణ అవసరం



భీమునిపట్నం: బుధవారం సాయంత్రం మంత్రి గంటా శ్రీనివాసరావు నివాసంలో భీమిలి జోనల్ కమిషనర్ బి. సన్యాసినాయుడు, వుడా సెక్రెటరి శ్రీనివాస్ లతో భీమిలి లో రోడ్ విస్తరణ గురించి మంత్రి చర్చించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ రావడం వల్ల భీమిలి లో టూరిజం బాగా అభివృద్ధి చెందిన తరుణం లో భీమిలి లో రోడ్ విస్తరణ అవసరం గురించి చర్చించారు. తగరపువలస నుంచి భీమిలి, భీమిలి నుంచి దొరతోట రోడ్ ల గురించి ప్రజా అభిప్రాయం తీసుకొని పనులు చేపట్టాలని అధికారులును అదేశించారు ఇవన్ని చేపడితే భీమిలి మరింత సుందరం గా తయారై డెస్టినేషన్ గా తయారు అవుతుందని మంత్రి తెలియజేశారు. ఈ సమావేశం లో నియోజకవర్గ ఇన్చార్జి చిక్కాల. విజయ్ బాబు, జోనల్ కార్యాలయం ఏ.సి.పి పాల్గొన్నారు

# ఆలమూరులో ఘనంగా జ్యోతిభా పూలే జయంతోత్సవం



ఆలమూరు :- మండల కేంద్రం ఆలమూరులో బుధవారం మహాత్మా జ్యోతిభాపూలే 192వ జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొత్తపల్లి ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన జ్యోతిభా పూలే జయంతోత్సవంలో ఎఎమ్‌సి ఛైర్మన్ ఈదల సత్యనారాయణ చౌదరి, వైయస్సార్‌సిపి నాయకులు చల్లా ప్రభాకరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొత్తూరి వీరన్ననాయుడు, ఎంపిడిఓ నాతి బుజ్జి, ఏఓ కె.వి.ఎన్.రమేష్‌కుమార్, పశు సంవర్ధశాఖ ఏడిఏ డా॥ ఓ.రామకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొని జ్యోతిభా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే మండల పరిధి జొన్నాడ మూలాటిరేవు కాలనీలో పంచాయితీ కార్యాలయం ఏరియా, బి.సి. కాలనీలో వున్న జ్యోతిభా పూలే విగ్రహాలకు మండల దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ డా॥ బి.ఆర్. అంబేద్కర్ లాంటి మహామేధావులు సహితం స్ఫూర్తినిచ్చిన మహావ్యక్తి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, మండల దళిత చైతన్యవేదిక గౌరవాధ్యక్షులు డా॥ ఓ.రామకృష్ణ, ప్రజా సంఘాల సమాఖ్య అధ్యక్షులు కె.రామకృష్ణ, ఏఎమ్‌సి మాజీ వైస్ ఛైర్మన్ గొడవర్తి బాబి, చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు దమ్ము సత్యనారాయణ, వార్డుమెంబరు చిటికెన సత్యనారాయణ, ఈలి సత్యనారాయణ, ఆనెం శంకరుడు, వి.శ్యామ్, జి.ఆనంద్, యాళ్ళ రమణయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఈపీడీసీఎల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే

## 192వ జయంతి వేడుకలు



విశాఖపట్నం : మహాత్మా జ్యోతిరావు పూలే 192వ జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర గనుల శాఖ మంత్రి ఆర్.వి. సుజయ్ కృష్ణ రంగారావు, సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.వై. దొర పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు పతివాడ నారాయణ స్వామి నాయుడు, కోళ్ల లలిత కుమారి, విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని భాస్కర్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శోభ స్వాతి రాణి, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు బొడ్డు శేషు కుమార్, టివిఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.




గ్రేటర్ విశాఖ 28వ వార్డు విల్లూరి చక్రవర్తి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, బిజెపి ప్రభుత్వానికి బుద్ధి రావాలని కోరుతూ వెంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు విల్లూరి తిరుమలా దేవి, చిన్న, మంగరాజు, యల్లపు బాబ్జి, రమణ, సత్య, లక్ష్మి, సింగుపల్లి మాధవి, గౌరమ్మ, పూడి చంద్రయ్య తదితరులు ఉన్నారు.

స్థానిక గ్రీన్‌పార్క్ హొటల్ పక్కన ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సమాఖ్య ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి ఘటించారు. ఏపీకి ప్రత్యేక హెూదా, విశాఖకు రైల్వే జోన్ త్వరగా మంజూరు చేయాలని నినాదాలతో హెూరెత్తించారు. ఈ కార్యక్రమంలో దువ్వారపు రామారావు, నరవ పైడిరాజు, మల్లేశ్వరరావు, గోవిందు, అప్పారావు, పొన్నాల మోహనరావు, ఆడారి కిషోర్ కుమార్, రాజారావు తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు.



# డా. కూటికుప్పల సూర్యారావుకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం



విశాఖపట్నంః ప్రముఖ వైద్యనిపుణుడు పద్మశ్రీ డా కూటికుప్పల సూర్యా రావు కు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందింది. డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ :వ్యక్తి నహిన్ సంకల్ప్ అనే పుస్తకా విస్కారణోత్సవం కార్యక్రమం లో పాల్గొనవలసిందిగా డా . సూర్యా రావ్ కు ఆహ్వానం రావడం విశేషం. డా.బి.ఆర్. అంబేడ్కర్ జయంతి ని పురస్కరించుకొని రాష్ట్రపతి భవన్ దర్బార్ హాల్ లో డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ :వ్యక్తి నహిన్ సంకల్ప్ అనే పుస్తక శీ ను ఏప్రిల్ 18 సా.6 గంటలకు ఉప రాష్ట్రపతి గౌ. శ్రీ .వెంకయ్య నాయుడు ఆవిష్కరిస్తున్నారు. ప్రథమ పుస్తక ప్రతిని భారత రాష్ట్రపతి రాంనాథ్ కొవింద్ స్వీకరిస్తారు. 2008 లో నాటి భారత రాష్ట్రపతి గౌ.ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా పద్మశ్రీ అందుకున్న డా. కూటికుప్పలను ఆటా- టాటా సంస్థ విశిష్ట పురష్కారం తో సత్కరించింది. అలాగే అత్యంత ప్రతిష్టాత్మక మైన ఫెల్లో ఆఫ్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ పురస్కారం అందుకున్నారు. గత ఏడాది ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఆచార్యుడిగా నియ మించింది. లయన్స్ క్లబ్ శతవార్షికోత్సవాల సందర్భంగా డాక్టర్ సూర్యారావు కుసేవా, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవా పురష్కరాన్ని ప్రధానం చేసింది.

# పూలే గొప్ప సంఘసంస్కర్త

**37వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గంకల అప్పారావు**



కంచరపాలెంః మహారాష్ట్రీయుడైన మహాత్మా జ్యోతీరావు పూలే గొప్ప సంఘసంస్కర్త. దళితులకు, స్త్రీలకు విద్య నిర్బంధంగా యిచ్చి తీరాలని వారి కోసం పోరాడిన ధీశాలి జ్యోతీరావు పూలే అని జివిఎంసి 37వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గంకల అప్పారావు పేర్కొన్నారు. బుధవారం ఉదయం వార్డు పరిధిలోగల ఇందిరానగర్-3లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఘనంగా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు ముందుగా జ్యోతి రావు పూలె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి రూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

# అంకితభావంతో విధులు నిర్వర్తించండి

- 12వ వార్డు లలితానగర్, అక్కయ్యపాలెం, చిన్నబస్తీ, శంకువానిపాలెంలో పర్యటన
- ఇంటింటి నుండి చెత్త సేకరణ నిర్వహించాలి
- కాలువలను శుభ్రపరచండి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: జివియంసి 12వ వార్డుపరిధిలో గెడ్డలు, కాలువల్లో పూడిక తొలగించాలని కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. క్షేత్రపర్యటనలో భాగంగా 12 వ వార్డుకు చెందిన జగ్గారావు బ్రిడ్జి, లలితానగర్, అక్కయ్యపాలెం, చిన్నబస్తీ, శంకువానిపాలెంలలో బుధవారం పర్యటించి పలుసూచనలు చేశారు. రోడ్ మార్జిన్లను, రహదారులను సక్రమంగా శుభ్రం చేయాలని పేర్కొన్నారు. ఇంటింటి నుండి చెత్తసేకరణ నిర్వహించాలని సూచించారు. రహదారుల ప్రక్కన బిల్డింగ్ డెబ్రిస్ ఉండడాన్ని గమనించి తక్షణం తొలగించాలని పేర్కొన్నారు. దోమల నివారణకు కాలువలు పరిశు భ్రంగా ఉండేలా చూడాలని అభిలషించారు. నూతన భవన నిర్మాణ ప్లాన్స్‌ను పరిశీలించి, లోపాలు గుర్తిస్తే నోటీసులు జారీ చేయాలని ఏసిపి నాయుడును ఆదేశించారు. యుజిడి ఇ.ఇ శేఖర్‌కు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం 80 అడుగుల రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పేర్కొన్నారు.

అధికారులు, సిబ్బంది అంకితభావంతో కృషి చేయడం ద్వారా స్వచ్ఛ విశాఖకు దోహదపడాలని పేర్కొన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య,ఇ.ఇ వెంకటి, ఏసిపి నాయుడు, ఏ.యం.ఓ.హెచ్ డా.లక్ష్మి తులసి తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావుపూలే మహాత్ముడు.. గొప్ప సంఘసంస్కర్త

**వైకాపా సమన్వయకర్త సనపల చంద్రమౌళి**



మాధవధారః జ్యోతిరావుపూలే మహాత్ముడు.. గొప్ప సంఘసంస్కర్త, స్త్రీ విద్యకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన వ్యక్తి. స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబం విద్యావంతమౌతుందని, తద్వారా సమాజం, దేశం విద్యామయమౌతుందని 39వ వార్డు వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త సనపల చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఉత్తర నియోజకవర్గం 39వ వార్డు మాధవధారలో బి.సి సెల్ కమిటీ అధ్యక్షడు బగాది బాలకృష్ణ రావు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిదిగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త సనపల చంద్రమౌళి పాల్గొన్నారు . ముందుగా జ్యోతిరావు పూలే ఫొటోకు పూల మాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భాంగా ఆయన మాటలాడుతూ జ్యోతిరావు పూలె దళితులకు, స్త్రీలకు విద్య నిర్బంధంగా యిచ్చి తీరాలని వారి కోసం పోరాడిన ధీశాలి అని , ఆ మహానుభావుని గుర్తు చేసుకోవడం చాల ఆనందముగా ఉందని అన్నారు . ఈ కార్యక్రమంలో 41 వ వార్డు అధ్యకడు చల్లా ఈశ్వరావు ,39 వ వార్డు మహిళా అధ్యక్షురాలు శ్రీమతి పప్పల సునీత ,మాజీ యు.టి.ఎఫ్ అధ్యకడు పైడి కృష్ణారావు , మైనారిటీ కమిటీ అధ్యక్షురాలు కొండపల్లి చిట్టి తల్లి (సోనీ) , బాన్న. సింహాద్రి ,కాసి సుబ్బారెడ్డి , బోడపాటి శ్రీనివాసరావు ,కేతుమూరి మురళీకృష్ణ . బి.మురళి , సత్తారు కుమారి , సరస్వతి తదీతరులు పాల్గొన్నారు .

# పాపాహోంకు ఆర్థిక వితరణ

- జర్నలిస్టుల సంక్షేమానికి మరింత కృషి
- వి.జె.ఎఫ్. అధ్యక్షుడికి ఘనసన్మానం



విశాఖపట్నం : పాపాహోం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అన్నారు. బుధవారం ఉదయం పాపాహోంలో 75మంది విద్యార్థులకు అట్టలు, పలకలు, పెన్నులు, కిట్టులను శ్రీనుబాబు చేతులమీదుగా అందజేశారు. దీనితోపాటు పిల్లలందరికీ భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంచే మూడుసార్లు ఉగాది పురస్కారాలు అందుకున్న గంట్ల శ్రీనుబాబును జర్నలిస్టులు, పాపాహోం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లడుతూ పాపాహోంలో విద్యాభ్యాసం సాగించిన ఎంతోమంది నేడు ఉన్నతశిఖరాలను అధిరోహించారన్నారు. ప్రతిఒక్కరూ మెరుగైన విద్యాభ్యాసం సాగించి అందుకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు దక్కించుకొని, సమాజానికి, పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ నెల 15, 16, 17 మూడురోజులకు సరిపోయే ఆహారపదార్థాల నిమిత్తం రూ.9 వేలు పాపాహోంకు అందజేస్తున్నట్టు శ్రీనుబాబు ప్రకటించారు. పాపాహోంలో సత్కారం పొందటం ఆనందంగా వుందన్నారు. భవిష్యత్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి తన శక్తివంచనలేకుండా కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎస్.వి.బి. కుమార్, అశోక్‌రెడ్డి, అబ్బాస్, జుబేర్, న్యూస్‌ఫైర్ చక్రవర్తి, రాజ్‌కుమార్, శ్రావణ్ తదితరులంతా పాల్గొనగా గోపి ఆర్థికసహాయం అందజేశారు.

# మహిళా విద్యకు ఆద్యుడు పూలే

**వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు**



ఆంధ్రవిశ్వవిద్యాలయంః మహిళా విద్యకు ఆధ్యునిగా మహాత్మ జ్యోతిరావు పూలే నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకునా బుధవారం ఉదయం ఏయూ బయోకెమిస్ట్రీ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నో అవమానాలను ఎదుర్కొని పూలే దంపతులు స్త్రీ విద్యను ప్రారంభించారన్నారు. రెక్టార్ ఆచార్య కె.గాయిత్రి దేవి మాట్లాడుతూ పూలే దంపతులు చేసిన త్యాగం ఎంతో శ్లాఘనీయమన్నారు. అధ్యయనం కేంద్రాన్ని వర్సిటీలో ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమ మహేశ్వర రావు మాట్లాడుతూ సమాజంలో సాంఘీక దురాచారాలను నిర్మూలించడానికి పూలే ఎనలేని కృషి జరిపారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.సూర్య ప్రకాశ రావు, రంగనాథన్, ఆచార్యులు పి.హరి ప్రకాష్, పి.ఎస్ పాల్, పి.ప్రేమానందం, టి.వెంకట క్రిష్ణ, డాక్టర్ కె.ఎస్.ఎన్ మూర్తి, యోహాన్ బాబు, విశ్రాంత పోలీస్ అధికారి కరణం సత్యనారాయణ, షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో ధర్మశ్రీ ఆధ్వర్యంలో రైల్ రోఖో

అనకాపల్లి : అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు బుధవారం రైలు రోఖో జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున చోడవరం నియోజకవర్గం కార్యకర్తలు పాల్గొని ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ప్రత్యేక హెూదా ఆంధ్రుల హక్కు అని, కేంద్ర ప్రభుత్వం వెంటనే హెూదా విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. ప్రజలను నరేంద్రమోడీ చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు మోసం చేస్తూ వచ్చారని ఇక ప్రజలు మోసపోయే పరిస్తితి లేదని హెచ్చరించారు. భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గం నలుమూలల నుండి విచ్చేసిన కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధీశాలి శోభా హైమావతి

అనంతగిరిః మండలంలోని ఒక చిన్న పల్లెటూరు. ఆఊరు పేరు భీమవరం. అనేచిన్న గ్రామంలో మురహరి రావు, సింహాచలం అనే దంపతులకు పుట్టిన పెద్దకుమార్తె హైమావతీదేవి. ఈమె సాహసానికి మరో రూపం. సహనానికి అసలు రూపం. ఈరెండు కలబోసిన రూపమే మన శోభ హైమావతీదేవి. మొన్న శాసనసభ్యురాలు. నిన్న. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు నేడు విద్యుత్ పంపిణీ సంస్థలో డైరెక్టర్ ఇలా పదవిఏదైనా ఆపదవికే గౌరవం తెచ్చిన స్వభావం ఆమె సొంతం

ఆమె 199 నుంచి 2004 వరకు శృంగవరపుకోట శాసనసభ్యులగా పని చేసిన కాలములో నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలకు కార్యకర్తలకు ఏపని అయినా వెంటనే చేయించేవారు అసెంబ్లీలో స్తానిక సమస్యలపై స్పష్టమైన వానీని వినిపించి వాటిని సాధించుకునేవారు యస్. కోట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు మారుమూల గిరిజన గ్రామాలు గుర్తించి వాటికి రహధారులు మరియు త్రాగునీరు సౌకర్యాలు కల్పించారు. యస్ కోటలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం చేయించారు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాములో విశాఖ ఏజన్సీ లో బాక్సైట్ నిక్షేపాలు తవ్వకాలు తవ్వి జిందాల్ కంపెనీ నిర్మించేందుకు చేపట్టిన భూసేకరణను అడ్డుకునేందుకు ఆమె చేసిన పోరాటం మరువలేనిది ఆసమయంలో స్త్రీ అనికూడా చూడకుండా ఆమెను అరెస్టు చేయించి కారాగారంలో పెట్టారు. అయినా ఆమె చలించలేదు ఆమె ఎప్పుడు ప్రజల గురించే ఆలోచించి ప్రజలకు సేవచేయడంలోనే ఆమె ముందుంటారు. అందుకే చంద్రబాబు నాయుడు ఇంతవరకు ఈపీడసియల్ డైరెక్టర్ పదవిలో ఎక్కడా మహిళలకు ఇవ్వలేదుయ ఈమంటే ఎంతనమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు అనంతగిరి మండల ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనంతగిరి మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు గుజ్జెలపైడితల్లి , భీంపోలుశివ ఈమెకు అభినందనలు




తెలియపరిచారు అలాగే ఈమెకు ఈపదవి ఇచ్చినందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేసారు.

# స్పోకెన్ హిందీ ఉచిత శిక్షణ తరగతులు ...

కంచరపాలెం: జివిఎంసి 39 వార్డు పరిది మాధవధార ప్రాంతంలోనున్న హిమజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత స్పోకెన్ హిందీ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లుగా సంస్థ అధ్యక్షురాలు కె .హిమశ్రీ తెలిపారు . ఏప్రిల్ 20వ తేది నుండి మే 15వ తేది వరకు శిక్షణను ఇవ్వనున్నామన్నారు . ఆసక్తి గలవారు 7396074377 నంబర్లను సంప్రదించాలని తెలిపారు . స్థానికులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా నిర్వహకులు కోరారు .

# కళ్లకు నల్లబ్యాడ్జీలతో వైసీపీ నిరసనలు

అనకాపల్లి : ఏపికి ప్రత్యేక హోదా కోరుతూ ఢిల్లీలో వైసిపి ఎంపీలు ఆమరణ నిరాహార దీక్షకు సంఘీబావంగా పట్టణంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద, వైసీపీ శ్రేణులు కల్లకు నల్లబ్యాడ్జీలు కట్టుకుని మోకాళ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. రాజీనామా చేసిన ఎంపీలు ఢిల్లీలో ప్రత్యేక హోదాపై ప్రాణాల సైతం లెక్కచేయకుండా, రాష్ట్ర సంక్షేమం కోసం చేస్తున్న నిరాహారదీక్షలు ప్రజలు చూస్తున్నారని, మొండి వైఖరిగా ప్రధాని మోడీ వ్యవహరించడం, ఆంధ్రులకు సిగ్గుచేటని, వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. వైసీపీ శ్రేణులు ఢిల్లీలో చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షలకు పలు అఖిలపక్ష పార్టీ నాయకులు సంఘీభావంగా తమ మద్దతును తెలియజేస్తున్నారని, వారు సంతోషం వ్యక్తం చేసారు. ఈ తరుణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చౌకబారు మాటాలతో ప్రజలను, మబ్బిపెడుతూ ప్రత్యేక హోదా పక్కనపెట్టి వచ్చె ఎన్నికలలో గెలుపే ధ్యేయంగా రాష్టాన్ని తండ్రి కొడుకులు మంత్రులు, ఎమ్మెల్యేలు, విచ్చల విడిగా, ప్రభుత్వ ఆస్తులను దోచుకుంటున్నారని, వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రత్యేక హెూదాపై అలుపెరగని, పోరాటం మా నాయకుడు జగన్మోన్‌రెడ్డి చేస్తున్నారని, అందుకు రాష్ట్రంలో అఖిలపక్షాలు కూడా, జగన్మోహన్‌రెడ్డికి మద్దతు తెలియజేయడం మా పార్టీ చేసిన ఘనవిజయానికి మొదటి మెట్టు అని వారు సంతోషం వ్యక్తం చేసారు.

ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సరే, ప్రత్యేక హెూదా సాధించితీరుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, వైసీపీ నాయకులు జాజుల రమేష్, ఆళ్ల నాగేశ్వరరావు, కత్తెర శ్రీధర్, గాంధీ, భూలోకనాయుడు, గొల్లవిల్లి శ్రీను, కరక సోమునాయుడు, తేగాడ లక్ష్మి, గణేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్ హబ్‌గా ఏపీ

**ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు**

తిరుపతి : సెల్‌ఫోన్ తయారీ పరిశ్రమల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన షియామి సంస్థ ఏపీలో తమ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమితో పాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో షియామి సంస్థతో పాటు ఆ సంస్థకు విడిభాగాలను సరఫరా చేసే కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. ఫాక్స్‌కాన్, డిక్సన్, సెలకాన్ వంటి సెల్‌ఫోన్ పరిశ్రమలతో ఇరవై వేల మంది ఉపాధి పొందుతున్నారని.. షియామి వంటి సంస్థల ద్వారా మరో 20 వేల మందికి ఉపాధి వస్తుందన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

మెటీరియల్స్ సరఫరా

టెండరు సంఖ్య. 30185223, తేదీ: 09.04.2018

పని పేరు: డీజిల్‌తో నడిచే ఫోర్క్‌లిఫ్ట్ ట్రక్కు 3 టన్ను కెపాసిటి స్టాండర్డ్ యాక్ససరీస్‌తోపాటు తయారీ: గోద్రెజ్ & బాయిస్ మాన్యు ఫాక్చరింగ్ కంపెని లిమిటెడ్, మోడల్ నెం. Gx300D లేదా అటువంటిది సప్లయి, ఇన్‌స్టలేషన్ మరియు కమీషనింగ్ చేయుట. (1) ముఖ్యమైన స్పెసిఫికేషన్స్: (ఎ) ఫోర్క్‌లిఫ్ట్ ట్రక్కు రేటెడ్ కెపాసిటి: 3000 KG (బి) లోడు సెంటర్: 500 MM (సి) గరిష్టంగా ఫోర్క్ ఎత్తు: 4500 MM (డి) లోవర్డ్ ఎత్తు: 2150 MM (ఇ) ఫ్రీలిఫ్ట్: 1530 MM (ఎఫ్) ఫోర్క్ పొడవు: 1000 MM (జి) ట్రాన్స్‌మిషన్: ఆటోమ్యాటిక్ టర్క్యుకన్వర్టర్ (హెచ్) టైర్లు: సాలిడ్‌టైర్లు, (ఐ) డ్రైవ్: సింగిల్ (2 ముందు & 2 వెనుక) (జె) స్టీరింగ్: పవర్ స్టీరింగ్ (కె) స్పీడు: 2 FWD & 2 REV (2) యాక్సిసరీస్: (ఎ) హెడ్ & టైల్ లైట్స్, (బి) సిగ్నల్ లైట్ (సి) లోడ్ బ్యాక్ రెస్ట్ (డి) స్టాండర్డ్ టూల్ కిట్ (ఇ) రియర్ వ్యూమిర్రర్ (ఎఫ్) సీటు బెల్ట్. RITES వారిచే తనిఖీ. (పరిమాణం: 04 నెంబర్లు).

సూచన: మెటీరియల్‌ను 35 దినములలోగా సరఫరా చేయవలెను.

టెండరు తెరచు తేదీ మరియు సమయం: 25.05.2018న 1500 గంటలకు

పూర్తి వివరాలు లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in.

సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్, వాల్తేరు.

PR-25/J/18-19

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**ప్రకటన రద్దు చేయుట**

టెండరు ప్రకటన నెం. eT-East-WAT-02-2018 తేదీ. 07.03.2018 కలిగిన 17.04.2018న తెరువ వలసినది పరిపాలనా పరమైన కారణములు చేత రద్దు చేయబడినది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు.

PR-23/J/18-19

# విజయభాను సంపాదకీయం

## మనుష్య రవాణా అమానవీయ చర్య

ఆధునిక సమాజంలో కూడా మనుషుల అక్రమ రవాణా జరుగుతుండటం కలిచివేస్తున్నది. ఈ అమానవీయ చర్య నేటి సామాజిక వికృత రూపానికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఎప్పటికప్పుడు మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా రోజురోజుకూ ఈ అభాగ్యుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలోనే మనుషుల అక్రమ రవాణాపై దక్షిణాసియా దేశాల రెండురోజుల అంతర్జాతీయ సమావేశం హైదరాబాద్‌లో గత శని, ఆదివారాల్లో జరిగింది. దేశంలోని ఇరువై ఆరు రాష్ట్రాల నుంచే గాకుండా మయన్మార్, థాయిలాండ్, బంగ్లాదేశ్, నేపాల్ లాంటి దేశాలనుంచి దాదాపు 150 మంది ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సమావేశం మనుషుల అక్రమ రవాణా నిరోధానికి నిర్దిష్టంగా చేపట్టాల్సిన చర్యలను ప్రభుత్వాలకు సూచించింది. నానాటికీ పెరుగుతున్న అక్రమరవాణా కేసుల పట్ల అప్రమత్తం చేయటం ఆహ్వానించదగినది. మానవ అక్రమ రవాణాపై సరిహద్దు భద్రతా దళం రూపొందించిన నివేదికలో బంగ్లా యువతుల వ్యాపార కేంద్రంగా ముంబయి, హైదరాబాద్ ఉన్నదని ధ్రువీకరించటం ఆందోళన కలిగించేదే. పడుపు వృత్తికి భారత్ అతిపెద్ద మార్కెట్‌గా మారిందన్నది ఇంకా అవమానకర విషయం. మనుషుల అక్రమ రవాణా అనగానే సాధారణంగా మహిళలను అక్రమంగా తరలించి వారిని బలవంతంగా వేశ్యావృత్తిలోకి దింపటంగానే భావిస్తున్నారు. కానీ ఇదొక్కటే కాకుండా ఇంకా మనుషుల అక్రమ రవాణా అనేకరూపాల్లో బానిసత్వానికి కొనసాగింపుగా సాగుతున్నది. పిల్లలు పెద్దలనే తేడా లేకుండా అనేక మంది అపహరించి ఏవిధమైన రక్షణలు లేని భయంకర పరిస్థితుల్లో పని చేయిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 12 లక్షల మంది అపహరణకు గురవుతున్నారు. ఇందులో నలభై శాతం చిన్నపిల్లలే ఉండటం దిగ్భ్రాంతికరం. నేరాల నమోదు జాతీయ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం 2014లో 5,466 కేసులు నమోదైతే, 2016లో 8,132కు చేరింది. గడిచిన పదేండ్లలో దేశంలో మానవ అక్రమరవాణా పదిహేను రెట్లు పెరిగిందని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు 180 మంది బాలికలు కనిపించకుండా పోతున్నారు. గల్లంతైన బాల, బాలికల జాడ మరెప్పుడూ, ఎక్క డా దొరుకటం లేదు. ఇలా గల్లంతైన వారు ఏమవుతున్నారు, ఏ పరిస్థితుల్లో ఉంటున్నారో ఊహించుకుంటేనే కడుపు తరుక్కుపోతుంది. దేశంలో 80 లక్షల మంది బాలికలు వేశ్యావృత్తిలో మగ్గుతున్నట్లు అనేక స్వచ్ఛంద సంస్థలు తమ అధ్యయనాల ద్వారా తెలియజేస్తున్నాయి. మన దేశంలో పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ మనుషుల శరీరాలతో అమానుష వ్యాపారం జోరుగా సాగుతున్నదని అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు నేపాల్, బంగ్లాదేశ్ నుంచి ఇండియాలోకి యువతుల, బాలికల తరలింపు ఐదింతలు అయిందని తాజా నివేదికలు తెలియజేస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. వివిధ రూపాల్లో కొన సాగుతున్న మనుషుల అక్రమ రవాణా మానవీయతను మంట కలిపి స్వార్థానికి పరాకాష్టగా నిలుస్తున్నది. చిన్న పిల్లలను భయంకరమైన పని పరిస్థితులుండే ఇటుక బట్టీలు, నూనె మిల్లులు, చెత్త ఏరే కంపెనీల్లో చీకటి గుహల్లో బంధించి పనిచేయిస్తున్న తీరు అనేక సందర్భాల్లో హైదరాబాద్ నగర శివార్లలోనే బయట పడింది. ఇక పేదరికాన్ని ఆసరాగా చేసుకొని సాగే దురాగతాలకు అంతేలేదు. హైదరాబాద్ పాతనగరంలో పేదరికాన్ని ఆసరాగా చేసుకుని పెళ్ళి ముసుగులో యువతులను తరలిస్తున్న అరబ్ షేక్‌ల దురాగతాలు తెలియనివికావు. బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని ఆదివాసుల పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దుర్మార్గులు చేసే దురాగతాలకు అంతేలేదు. యువకులను తరలించి బానిసల కన్నా హీనంగా పనులు చేయించటం మొదలు, బాలికలను అక్రమంగా తరలించి వారితో అమానుష వ్యాపారం చేయిస్తున్నారు. ఇతర దేశాల నుంచి ముఖ్యంగా నేపాల్, బంగ్లా, థాయిలాండ్‌ల నుంచి అమ్మాయిల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. గత ఏడాది హైదరాబాద్‌లో 33 మంది థాయి అమ్మాయిలను వ్యభిచార కూపాల నుంచి రక్షించిన ఘటన ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యం లో మనుషుల అక్రమ రవాణాపై దక్షిణాసియా దేశాల అంతర్జాతీయ సదస్సు చేసిన తీర్మానాలు, సూచనలు విలువైనవి. మనుషుల అక్రమ రవాణా విషయంలో న్యాయపరమైన, చట్టపరమైన భద్రతాపరమైన విషయాల్లో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని సూచించింది. మనుషుల అక్రమ రవాణాకు పాల్పడ్డవారికి ఏడాదికి మించి శిక్ష లేకపోవటంతో ఈ నేరాలకు అడ్డులేకుండాపోతున్నది.

## నా ప్రాణాలకు ముప్పుంది: ఇంద్రాణి



ముంబై: ఐఎన్‌ఎక్స్ మీడియా మాజీ చీఫ్ ఇంద్రాణి ముఖర్జీ సంచలన ప్రకటన చేసింది. తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొంది. ముంబైలోని జేజే ఆసుపత్రి నుంచి ఇంద్రాణి ముఖర్జీని బుధవారంనాడు డిశ్చార్చ్ చేశారు. ఆసుపత్రి నుంచి బయటకువస్తుండగా మీడియా అడిగిన ప్రశ్నకు 'అవును. నా ప్రాణాలకు ముప్పుంది' అని ఇంద్రాణి ముక్తసరిగా చెప్పింది. గత శు క్రవారంనాడు తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బైకుల్లా మహిళా జైలు నుంచి జేజే ఆసుపత్రికి తరలించారు. మానసిక ఒత్తడిని అధిగమించేందుకు తీసుకునే మెడిసన్ ఓవర్‌డోస్ కావడం వల్లనే ఆమె అస్వస్థతకు గురైనట్టు రెండ్రోజుల క్రితం జేజే ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. అయితే ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్) మాత్రం కెమికల్ అనాలసిస్ పరీక్షలో ఇంద్రాణికి ఓవర్‌డోస్ ఇచ్చారన్న వాదనను కొట్టివేసింది. ఎఫ్‌ఎస్‌ఎల్ గురువారంనాడు ఈ నివేదికను జేజే ఆసుపత్రికి సమర్పించనుంది. కాగా, ఓవర్‌డోస్ ఇవ్వడం ద్వారా ఇంద్రాణి అడ్డుతొలగించే ప్రయత్నం జరిగినట్టు బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఎన్‌ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో ఇంద్రాణి కీలక సాక్షిగా ఉంది.

## నన్ను చంపాలనుకుంటున్నారు... మాజీ సీఎం సంచలన ఆరోపణ



పాట్నా: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ భార్య రబీదేవి సంచలన ఆరోపణ చేశారు. తనపైన, తన కుటుంబంపైన కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీహార్ ప్రభుత్వం నుంచి తమ కుటుంబానికి ముప్పు ఉందని అన్నారు. రబీదేవి నివాసం నుంచి భద్రతను ఉపసంహరించిన నేపథ్యంలో ఆమె ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రాత్రి 9 గంటల ప్రాంతంలో సెక్యూరిటీ రద్దు చేశారు. చూడండి... ప్రభుత్వం ఏమి చేస్తోందో? నన్ను, నా కుటుంబానికి చంపేందుకు కుట్ర చేస్తోంది' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

భద్రత ఉపసంహరించడంపై భయపడుతున్నారా అని అడిగినప్పుడు 'నేను భయపడను. నేను ప్రజల్లోకే వెళ్తాను. ప్రజలే నాకు భద్రత కల్పిస్తారు. పైన భగవంతుడు ఉన్నాడు. మా పక్కన ప్రజలు ఉన్నారు' అని రబీదేవి సమాధానమిచ్చారు. పచ్చి అబద్ధాల ప్రభుత్వం ఇదని, సరైన సెక్యూరిటీ కూడా ఇవ్వడం లేదని, తనకు కనీసం హౌస్ గార్డ్ కూడా లేరని ఆమె నిప్పులు చెరిగారు. ఏదైనా జరగరానిది జరిగితే ప్రభుత్వమే అందుకు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కాగా, రబీదేవి పాట్నా నివాసం నుంచి మంగళవారంనాడు 32 మంది బీహార్ మిటలరీ పోలీస్ జవాన్లను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించింది. ప్రభుత్వ ఆదేశాలతో రాత్రికి రాత్రి జవాన్లంతా తమ సరంజామా సద్దుకుని రబీ నివాసాన్ని విడిచి వెళ్లిపోయారు. ప్రధాని నరేంద్ర మోదీ బీహార్ వచ్చిన రోజే రబీదేవికి సెక్యూరిటీ ఉపసంహస్తూ నితీష్ సర్కార్ నిర్ణయం తీసుకోవడం సంచలనమవుతోంది.

## బీజేపీకి సుప్రీంకోర్టు ఝలక్

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునేది లేదని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని కోరుతూ కలకత్తా హైకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర బీజేపీకి తెలిపింది.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ పత్రాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని, నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని, గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీలను మార్చాలని, పారామిలిటరీ దళాలను మోహరించాలని పశ్చిమ బెంగాల్ బీజేపీ శాఖ సుప్రీంకోర్టును కోరింది. సహాయ పంచాయతీ ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్న బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు తమ పార్టీ అభ్యర్థులకు నామినేషన్ పత్రాలను ఇవ్వడం లేదని ఆరోపించింది. అధికారంలో ఉన్న టీఎంసీ కార్యకర్తలు తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నట్లు ఆరోపించింది.

## కుప్పకూలిన రష్యా హెలికాప్టర్... ఆరుగురి మృతి...



మాస్కో : తూర్పు రష్యాలోని ఖబరోవ్‌స్క్ నగరంలో దారుణం జరిగింది. రష్యా అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం వోస్టోక్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎంఐ-8 హెలికాప్టర్ ఖబరోవ్‌స్క్ నగరంలోని ఓ వీథిలో కుప్పకూలింది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11.30 గంటలకు జరిగిన ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందారు. వీరంతా హెలికాప్టర్ సిబ్బందే. ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో ఎవరూ బయటపడలేదు.

ఈ హెలికాప్టర్‌లో సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు వోస్టోక్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. దీనిలో ప్రయాణించిన సిబ్బంది ఆరుగురు మరణించినట్లు పేర్కొంది. ల్యాండింగ్ ప్యాడ్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ హెలికాప్టర్ కూలిపోయిందని, వెంటనే మంటల్లో చిక్కుకుందని తెలిపింది.

దర్యాప్తు అధికారుల కథనం ప్రకారం ఈ హెలికాప్టర్ కుప్పకూలిపోవడానికి కారణం వాతావరణం సరిగా లేకపోవడమేనని తెలుస్తోంది. మరోవైపు సాంకేతిక లోపం జరిగిందా? పైలట్ తప్పిదం ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా దర్యాప్తు జరుగుతోంది. దీనిలోని బ్లాక్‌బాక్స్‌ను పరీక్షిస్తున్నారు.

## కవి సమయం

### కనిపించే దైవం గురువు

అజ్ఞాన తిమిరాన్ని తరిమి
జ్ఞాన జ్యోతిని వెలిగించి
విద్య ఓ తపస్సు జీవితానికది
ఒక ఉషస్సు అని బోధించి

మానవ మనుగడకు
విద్య మూలాధారమని
విద్యార్థి జీవితాన్ని
దిశ నిర్దేశం చేసి

వినయ విధేయతలు విద్య ద్వారానే
వ్యక్తికి సంక్రమిస్తాయని తెలిపి
ప్రతి నిత్యం విద్యార్థిగా ఉంటూ
మదిలో శోధించి బడిలో బోధించి

జ్ఞానాన్ని అందరికీ పంచి
వ్యక్తిని వ్యవస్థనీ సంస్కరించి
కనిపించే దైవంగా పూజలందుకొంటున్న
గురువులందరకు పాదాభివందనం

రచయిత
ఆర్.శంకర్
984921379

## పంచాంగం

మాసం : చైత్ర ; తిథి : ఏకాదశి ఉ. 6.00 శతభిషం రా. 1.35 వ.ఉ. 7.37ల 9.19 | గురువారం 12-04-2018

a **మేషం** : రుణం ఏ కొంత అయినా తీర్చగలుగుతారు. సేవా కార్యక్రమాల్లోనూ, భక్తి కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొంటారు. ఎదుటివారిని ఆకట్టుకునే ప్రయత్నంలో సఫలీకృతులవుతారు. కొత్త కొత్త పెట్టుబడుల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిత్య, కంది, మినుము, నూనె వ్యాపారస్తులకు దిన దినాభివృద్ధి ఉంటుంది. b **వృషభం** : జీవితంలో చక్కని మలుపు మీకు తెలియకుండానే జరుగుతుంది. పొదుపు ఆవశ్యకతను గురించి తెలుసుకుంటారు. స్త్రీలకు అనురాగ వాత్సల్యాలు పెంపొందుతారు. పాత మిత్రుల కలయిక మళ్ళీ మళ్ళీ జరగటం వల్ల మీలో ఎంతో ఉత్తేజాన్ని చేకూరుస్తుంది. కొత్త కొత్త వ్యాపారాల పట్ల ఏకాగ్రత వహిస్తారు. C **మిథునం** :ఉన్నట్టుండి మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. విద్యార్థులకు కోపం తారాస్థాయికి చేకూరుతుంది. కంట్రోల్ చేసుకోవడం వల్ల బంధు మిత్రులతో గుర్తింపు లభించగలదు. పండ్ల, పూల, కొబ్బరి వ్యాపారస్తులకు కలిసివచ్చే కాలం. కొన్ని అలవాట్లు మీకు ఎంతో చికాకును కలిగిస్తాయి. d **కర్కాటకం**: ఆర్థిక ఇబ్బంది అంటూ లేకపోయినా పురోభివృద్ధి అంటూ ఏదీ ఉండదు. ప్రయాణాలు మీకు అనుకూలించగలవు. మీరు తెలివైన వ్యక్తులతో జాగ్రత్త వహించండి. మీలో ఆత్మాభిమానం అధికమవుతుంది. ఐరన్, సిమెంట్, కలప, ఇటుక, వ్యాపారస్తులకు ఆశాజనకం. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. e **సింహం**: ముఖ్యులకు బహుమతులు అందజేస్తారు. వస్త్ర, బంగారు, వెండి, లోహ, పీచు వ్యాపారస్తులకు ఆశాజనకం. ప్లీడర్లకు, ప్లీడరు గుమాస్తాలకు చేపట్టిన పనిలో అవరోధాలను ఎదుర్కొంటారు. మీ పెద్దల మూలంగా మీ సమస్యలు జటిలమవుతాయి. మతపరమైన విషయాలు చర్చకు రాగలవు. వైద్యుల సలహా తప్పదు. f **కన్య**: విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. హోటల్, తినుబండారాల వ్యాపారులకు, క్యాటరింగ్ రంగాలవారికి కలిసివచ్చే కాలం. ఉన్నట్టుండి మీలో వేదాంత ధోరణి అధికమవుతుంది. మిమ్మల్ని వేరే వ్యక్తుల కలయిక వల్ల సంతృప్తి కానవస్తుంది. ప్రైవేట్ రంగాల వారు మార్పుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. **తుల**: పెద్దల ఆశీస్సులు మీకు మెండుగా లభిస్తాయి. ఇది సుఖపడే మార్గం అని రెడీమేడ్‌గా ఎక్కడా ఉండదు. మన మనస్సును బట్టి... మనలను బట్టి వుంటుంది. మీలో నిరుత్సాహాన్ని పక్కన పెట్టి ధైర్య సాహసాలతో ముందుకు సాగి జయం పొందండి. ప్రభుత్వ రంగ సంస్థల్లోని వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. h **వృశ్చికం**: ఏ విషయంలోనూ ఊగిసలాట మంచిది కాదని గమనించండి. విద్యార్థుల్లో నూతన ఉత్తేజం కానవస్తుంది. ఏజెంట్లకు, బ్రోకర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభదాయకంగా ఉండగలదు. సాంఘిక, సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణం తీర్చాలనే ఆలోచనను క్రియా రూపంలో పెట్టండి. i **ధనుస్సు**: యజమాన్యానికి సంబంధించిన విషయాలలో మీ సలహా ఎంతో సహకరిస్తుంది. ఎలక్ట్రికల్, టెక్నికల్ రంగాలవారికి కలిసివచ్చే కాలం. చిన్నచిన్న ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. జాగ్రత్త వహించండి. గృహంలో మార్పులు, చేర్పులు మీకు అనుకూలిస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. j **మకరం**: తాపీ పనివారికి, చేతి పనివారికి కలిసివచ్చే కాలం. వ్యవసాయ తోటల రంగాలలోని వారికి కలిసివచ్చే కాలం. నిత్యవసర వస్తు స్టాకిస్టులకు, మిర్చి, నూనె వ్యాపారస్తులకు పురోభివృద్ధి కానవస్తుంది. దైవ సన్నిధిలో గడపగలుగుతారు. ముఖ్యులకు బహుమతులు అందజేస్తారు. పెద్దల గురించి ఆందోళన చెందుతారు. k **కుంభం**: పీచు, లెదర్, హోమ్ వ్యాపారస్తులకు సంతృప్తి, అభివృద్ధి కానవస్తుంది. తోటివారితో అనుబంధాలు బలపడతాయి. సోదరీ, సోదరుల భావం అధికమవుతుంది. గతం కంటే ఇప్పుడు చాలా మెరుగ్గా ఉంటుంది. ధనం బాగా వెచ్చిస్తారు. మీ కలలు సాఫల్యమయ్యే కాలం ఆసన్నమైందని గమనించండి. k **మీనం**: ట్రాన్స్‌పోర్ట్, ఆటో మొబైల్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. మార్పుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. మీ సృజనాత్మక శక్తికి, తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, రసాయనిక ద్రవ్య వ్యాపారస్తులకు, మిర్చి, కంది స్టాకిస్టులకు పురోభివృద్ధి ఉండగలదు.

## భారతీయులు శుభకార్యాలకు

# పువ్వులను ఎక్కువగా ఉపయోగిస్తారెందుకు?

## సంకీర్తన



మన దేశంలో పువ్వులకు ఒక భక్తిరస విలువ ఉన్నది. మనము దేవతలకు వారిపట్ల ఉన్న భక్తికి గుర్తుగా పువ్వులను అందిస్తాము మరియు ఏ దేవతకు తగ్గట్లుగా ఆ పువ్వులతో పూజిస్తాము. వివిధ దేవతలు మరియు దేవతల ప్రార్థనలకు, వారివారి విశిష్టతను బట్టి పువ్వులను అర్పిస్తాము. సాధారణంగా భారతదేశంలో బంతి, మందార మరియు తామర వంటి పువ్వులను వివిధ దేవతల ఆరాధనకు ఉపయోగిస్తారు. పువ్వులు సానుకూల ఆలోచనా కంపనాలు అందిస్తాయని ఒక నమ్మకం మరియు వాటి ప్రకాశవంతమైన రంగులు మరియు సువాసనలు మన మీద దీవెనలు కురిపించే దేవతలను ఆకర్షిస్తాయని నమ్మకం. ఒక హిందూ మతం కూడా వివాహంలో వధువు మరియు వరుడు దండలు మార్చుకునే ఆచారం ఉన్నది. ఎందుకు భారతీయులు పవిత్రమైన సందర్భాలలో పువ్వులను ఉపయోగిస్తారు అన్నది కనుక్కుందాం? ఎందుకు ఇండియన్స్ పవిత్రమైన సందర్భాలలో పువ్వులు ఉపయోగిస్తారు?

మ్యారిగోల్డ్ (బంతిపువ్వులు) మ్యారిగోల్డ్ ఒక అసహ్యకరమైన వాసన కలిగి ఉంటుంది, కనుక కీటకాలు మరియు తెగుళ్ళను దూరంగా ఉంచుతుంది. కాబట్టి ఈ పువ్వులు మరియు దండలు హిందూమత దేవతలకు అర్పిస్తారు మరియు తోరణాల రూపంలో గృహాలను అలంకరించేందుకు ఉపయోగిస్తారు.

**మందార:** అందమైన ఎరుపు పుష్పం వినాయకుడికి మరియు దేవత కాళిమాతకు అర్పిస్తారు మరియు దీనివలన కొన్ని ఔషధ ఉపయోగాలున్నాయి. మందార మీ జీవితంలో సౌభాగ్యం తీసుకుని వొస్తుంది మరియు మీ శత్రువులను నాశనం చేస్తుంది.

**గులాబీలు:** గులాబి రేకులను కొత్తగా వివాహం అయిన వారి మంచం మీద చల్లుతూ ఉంటారు, ఎందుకంటే ఇవి సహజ కామోద్దీపన కలిగిస్తాయి. గులాబీలు ఉధృతిని మరియు ఒత్తిడి మరియు అలసటను తగ్గించి ప్రశాంతతను కలిగిస్తాయని పరిశోధనలు నిరూపించాయి. గులాబీలు ఒక వ్యక్తిని మానసికంగా ఎక్కువ ప్రశాంతంగా ఉంచుతాయని కూడా ఋజువు అయ్యింది.

**లోటస్:** విష్ణు, బ్రహ్మ, దేవత లక్ష్మీ, సరస్వతి వంటి అనేక హిందూ మతం దేవతలకు ఈ జల పుష్పం సమర్పించబడుతున్నది. ఇది స్వచ్ఛతకు మరియు పవిత్రతకు ఒక చిహ్నంగా ఉన్నది. ఈ పువ్వుల యొక్క ముడుచుకొని రేకులు ఆత్మ యొక్క విస్తరణను సూచిస్తాయి. బుద్ధిజంలో, దీనిని సృష్టి యొక్క చిహ్నం ప్రైమార్డియల్ స్వచ్ఛతగా చెపుతారు.

**జాస్మిన్:** పండువాసన గల ఈ పువ్వును కూడా



సాధారణంగా భారతదేశంలో దేవతలను పూజించటానికి ఉపయోగిస్తారు మరియు అనేక మంది మహిళలు వారి జుట్టు పరిమళంతో గుబాళించాలని తలలో అలంకరించుకుంటారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# చంద్రన్న బీమా అందజేత



పరవాడ:మండల కేంద్రమైన పరవాడలో చీపురుపల్లి సన్యాశి దేముడు అనారోగ్యం కారణంగా మృతి చెందారు. అయన భార్య చీపురుపల్లి కుమారికి పరవాడ సర్పంచ్ చుక్క రాము నాయుడు చేతులు మీదగా ఐదు వేలు రూపాయలు చంద్రన్న బీమాను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పైల రామచంద్ర రావు, జన్మభూమి కమిటి మెంబర్ రెడ్డి శ్రీనువాసు రావు, విఒఎ రమాదేవి, రమణమ్మ, గ్రామ పెద్దలు మరియు బీమా మిత్ర యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

# నీటి పథకం చుట్టూ ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు

రోలుగుంట : జానకిరాంపురం వరహానదిలో ఫ్లోరైడ్ గ్రామాలకు మంచినీటిని సరఫరా చేయడానికి నిర్మించిన సమగ్ర మంచినీటి పథకం చుట్టూ రక్షణ చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణ తెలిపారు. ఇసుకాసులు అక్కడ తవ్వకాలు చేయకూడదని నిబంధనలు ఉన్నా తవ్వకాలు చేయడంతో నీటిని నిల్వలు అడుగంటిపోయే ప్రమాదం ఉందనే ఉద్దేశ్యంతో ట్రాక్టర్లతో ఇసుకను దాని పక్కనే చుట్టూ పిల్లింగ్ చేస్తున్నారు. ఆది, సోమ రెండు రోజుల పాటు ట్రాక్టర్లతో ఇసుక ఫిల్లింగ్ చేశారు. ఈ పథకం చుట్టూ ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. ఈ పథకం నుంచి ఫ్లోరైడ్ గ్రామాలైన కొవ్వూరు, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, నిండుగొండ, కిలపర్తిపాలెం, ఎన్.కొత్తూరు గ్రామాలకు మంచినీటి సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే.

## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు

రావికమతం : కొత్తకోట శాఖా గ్రంథాలయంలో ఈ నెల25 నుంచి జూన్ 7 వరకూ వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రంథాలయాధికారి కన్నబాబు తెలిపారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వయస్సు విద్యార్థులకు ఈ కార్యక్రమంలో భాగంగా ఆటపాటలు, సైన్స్ ఎగ్జిబిషన్, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి అనేక విషయాలపై తర్ఫీదు ఇస్తూనే, విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందింపజేస్తామన్నారు. ఇప్పటికే పలు పాఠశాలల హెచ్‌ఎంలకు సర్క్యులర్ అందించామన్నారు.

# ప్రత్యేక హోదా సాధనే ధ్యేయం



నర్సీపట్నం : ప్రత్యేక హోదా సాధనే వైసిపి ధ్యేయమని నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి కన్వీనర్ పెట్ల ఉమాశంకరగణేష్ అన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం వైసిపి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలు ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ వైయస్.జగన్ గత నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు ప్యాకేజి చాలని చెప్పి ఇప్పుడు ప్రత్యేక హోదా కోసం పోరాడుతామనడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్ తమరాన అప్పలనాయుడు, బోడపాటి సుబ్బలక్ష్మి, చోటి, ఆరుగొల్లు రాజుబాబు, గొలుసు నర్సింహమూర్తి, ఎండి.భాష, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13న నర్సీపట్నంలో విద్యుత్ అదాలత్

కొయ్యూరు : నర్సీపట్నం ఈపిడిసిఎల్ డిఈ కార్యాలయంలో ఈ నెల 13న విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు కొయ్యూరు ఏఈ రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు.

వినియోగదారులు వారి సమస్యలను అక్కడ తెలపవచ్చని సూచించారు. అదాలత్‌ను ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తారన్నారు.

# గ్రామాల వారీగా ఓటర్ల జాబితా విభజన

కొయ్యూరు : ఓటర్ల జాబితాను గ్రామాల వారీగా విభజించాలని ఆదేశాలు వచ్చినట్లు ఈవోపిఆర్‌డి వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2013 జాబితాను గ్రామాల వారీగా విభజించేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ఈ నెల 17లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో వీఆర్వోలు, బిఎల్‌ఒలు పాల్గంటారన్నారు. ఒక పంచాయతీలో ఓట్లు మరో పంచాయతీలో ఉంటే ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వారి ఆదేశాల ప్రకారం తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# విమ్స్ ప్రవేటీకరణకు జివోలు విడుదల చేసి, మరోప్రక్క ప్రజలను తప్పత్రోవపట్టిస్తున్న ప్రభుత్వం!



విశాఖపట్నంః నిన్న విమ్స్ డైరెక్టర్ పత్రికా ప్రకటనలు ద్వార ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారని సిపిఐ(ఎం) నగర ప్రధాన కార్యదర్శి గంగారావు పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో మెరుగైన సేవల కోసమే పిపిపి అంటున్న డైరెక్టర్, ఈ అన్ని సేవలు అందరికి ఉచితంగా చేస్తామని ప్రకటించగలరా? రాష్ట్ర ప్రభుత్వం విమ్స్‌ను ప్రవేటికరణ చేయడం కోసమే రెండవ దశ నిధులు కేటాయించలేదు. కార్పోరేట్ సంస్థలకు విమ్స్ అప్పగించడానికే ఈ పిపిపి పథకం. ప్రభుత్వమే నిధులుకేటాయించాలని, జివో 33ని ఉపసంహారిచాలని భాతర కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్ విశాఖ నగర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

నగరంలో రాష్ట్రప్రభుత్వం కోట్లు ఖర్చుచేసి అనేక ఈవెంట్స్ చేస్తున్నారు, కోటిమంది ఉన్న ఉత్తరాంధ్రకు సూపర్ స్పెషాలిటీ అసుపత్రి ఏర్పాటు చేయలేకపోతున్నారు. ఉన్న అసుపత్రికి నిధులు కేటాయించలేక పోతున్నారు. ఉత్తరాంధ్ర లో పేదప్రజలు ఎక్కువ మంది ఉన్నారు. వీరు లక్షలు పోసి వైధ్యం చేయించుకోలేరు, పిపిపి కింద్ర వచ్చే వైద్యసేవలకు తప్పని సరిగ ఫీజులు చెల్లించాలి. ఇప్పటికే యూజర్ చార్జీలు పేరుతో విమ్స్ ప్రతి చికిత్సకి వివిద రూపాలలో ఫీజులు వసుళ్ళు చేస్తున్నారు. విమ్స్‌ను దశల వారీగా ప్రైవేటీకరించటానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో 33ని విడుదలచేసింది. అందులో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రింద కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆరు సూపర్ స్పెషాలిటీ విభాగాలను పిపిపి క్రింద ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించారు.ప్రభుత్వం వివిద పదకాలు క్రింద ఉచితవైద్య సేవల గూర్చి కాకుండా రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికి ఉచిత వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేస్తున్నాం.

కావున ఇప్పటికైనే తప్పుడు ప్రచారాలు మాని ఈ జివో 33ని వెంటనే ఉపసంహరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విశాఖనగర కమిటీ డిమాండ్ చేస్తున్నది. విమ్స్ ప్రైవేటీకరణ చర్యలు విరమించకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తున్నామని గంగారావు అన్నారు.

# ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి



నర్సీపట్నం : సిపిఐ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే 191వ జయంతి వేడుకలను నర్సీపట్నంసిపిఐ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే సామాజిక అసమానతల తొలగిపోవాలని తీవ్రమైన పోరాటం చేశారన్నారు. అశాస్త్రీయమైన మనువాదం మనుషులను నాలుగు వర్గాలుగా విభజించి మనిషిని మరొక మనిషి ద్వేషించుకొనే దుర్మార్గపు సమాజాన్ని నిర్మించిందని, దీనిని ఖండిస్తూ పూలే నిర్వహించిన సామాజిక విప్లవం చాలా గొప్పదన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డిసిహెచ్.రాజుబాబు, జి.గురుబాబు, రామునాయుడు, నర్సీపట్నం మండల కార్యదర్శి రుత్తల బుజ్జి, శ్రీరామ్మూర్తి, డిహెచ్‌పిఎస్ అప్పలరాజు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండలరావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర, సూర్యవతి, శ్రీనివాసచౌదరి, దాసు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

నాతవరం : నాతవరం మండలం జిల్లేడుపూడి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లాలం అబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రం అప్పులు ఉన్నప్పటికీ చంద్రబాబునాయుడు అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పల్లి అప్పలనాయుడు, సీనియర్ నాయకులు కొరుప్రోలు లక్ష్మినారాయణ, లాలం నానిబాబు, కొరుప్రోలు అప్పలనాయుడు, కొరుప్రోలు నూకరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుమలలో సాధారణ భక్తులతో సహపంక్తి భోజనం చేసిన మంత్రిఅయ్యన్న కుటుంబీకులు



నర్సీపట్నం : రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వెంగమాంబ అన్నదాన సత్రంలో సాధారణ భక్తులతో సహపంక్తి భోజన్నా మంత్రి కుటుంబ సభ్యులు చేశారు.

# నాటుసారా స్వాధీనం

యానాం : సముద్ర తీర ప్రాంతమైన గిరియంపేటలో 500 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి ఐలాండ్ 1, 4 దీవులలో టిన్నులలో ఒక్కొక్క దానిలో సుమారు 50 లీటర్ల చొప్పున ఉన్న 500 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని యానాం ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరివు సెల్వన్ , ఎస్.ఐ. బడుగు అల్ఫన్ రాజు, కానిస్టేబుల్ నవీన్ కాంత్, విఇఓ జానకిరామయ్య, తదితరులు ఈ దాడిలో పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ నితిన్ గౌహల్ కార్యాలయానికి చేరుకుని పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఛార్జి డిటి జయచంద్రన్ నాటుసారాను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దవుళూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు డిటి తెలిపారు.

# రాష్ట అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

## ఎన్టీఅర్ భరోసా పింఛన్లు పంపిణీలో ఎమ్మెల్యే బండారు



పరవాడ: 56వ వార్డు లంకెలపాలెం, మంత్రిపాలెం గ్రామంలో నూతనంగా ఎన్టీఅర్ భరోసా క్రింద మంజూరైన పింఛన్లను బుధవారము వృద్దులుకు, వితంతువులుకు, వికలాంగులకు స్దానిక శాసన సభ్యులు బండారు సత్య నారాయణ మూర్తి చేతుల మీదగా పంపిణీ చేసారు. అనంతరము అయన మాట్లడుతూ రాష్ట అబివృద్ది ఒక్క టిడిపితోనే సాద్యమని ఈ సందర్భంగా అయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రౌతు శ్రీనువాసు రావు, రౌతు మూర్తి, గెంజి రమణ, గుర్రంరాజు, అప్పికొండ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పులే జయంతి రోజు దళితులు, సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులకు ఖండన

## ప్రభుత్వం చెబుతున్న దళిత తేజం అంటే ఇదేనా?

కె. కోటపాడుః మండలం కె.సంతపాలెం దళితులకు 1978లో 22 మందికి 18 ఎకరాలు ప్రభుత్వ భూమికి పట్టాలిచ్చింది. దీనికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నుయ్యి తవ్వించి జీడి మొక్క ఇచ్చారు. దళితులు జీడి చెట్టులను పెంచారు. కాయలు కాపుకు వచ్చాయి. దీనిపై పెత్తందార్ల కన్నుపడింది. అప్పటికి దళితుల ఆర్థిక పరిస్థితి బాగోలేదు. దీనిని ఆసారగా చేసుకొని భూస్వాములు తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకొని మీరు మాకు ఎప్పుడు డబ్బులు తిరిగి ఇస్తే అప్పుడు మీ తోటలు వదిలేస్తామని కొంత డబ్బు ఇచ్చారు. గత రెండు సంవత్సరాల నుండి డబ్బులు ఇచ్చేస్తామని భూములు వదిలిపెట్టాలని దళితులు అడుగుతున్నారు. కొందరూ పెత్తందారులు ఎలాగైన ఈ భూములను దక్కించుకోవాలని అధికార పార్టీకి ఆశ్రయించి మంత్రి అయ్యన్నపాత్రుడు, మండల ఎంపిపి సహాకారంతో రెవిన్యూ అధికారులు దళితులను బెదిరిస్తున్నారు. దళితుల భూములు తిరిగి ఇవ్వాలని కె.కోటపాడు మండలంలో ధర్నా చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, సిపిఎం కె.కోటపాడు మండల నాయకులు యర్రా దేముడు, చింతాలు, భూబాధితులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.

రాష్ట్ర తెలుగుదేశం ప్రభుత్వం ఒకవైపు దళిత తేజం పేరుతో ప్రభుత్వ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తోంది. మరోవైపు ప్రభుత్వం అధికారుల, ప్రజాప్రతినిధుల అండతో పెత్తందార్లు దళితుల భూములు లాక్కొంటున్నారు. దళితులపై దాడులకు పూనుకుంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం గొప్పగా చెబుకుంటున్న దళితతేజం అంటే ఇదేనా? భారతదేశంలో కులం పేరుతో అణిచివేతకు గురౌతున్న బడుగు, బలహీనవర్గాలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహత్మ జ్యోతీరావు పులే జయంతి రోజు దళితులపై నిర్బంధాలు ప్రయోగించడం సమాజానికే సిగ్గుచేటు. దీన్నిబట్టి రాష్ట్ర టిడిపి ప్రభుత్వం పెత్తందార్లకు కొమ్ముకాస్తున్నారని స్పష్టంగా కనిపిస్తున్నది.

అణిచివేతతో ఉద్యమాలను ఆపాలేరని, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి యాక్టు సవరణ "భారత్ బంద్" సందర్భంగా దేశంలో వున్న దళితులందరూ తిరగబడ్డారని కాబట్టి వెంటనే కె.సంతపాలెం దళితుల భూములు తిరిగి దళితులకే ఇవ్వాని లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన ఉదృతం చేస్తామని సిపిఎం పార్టీ విశాఖ జిల్లా కమిటీ హెచ్చరిస్తుంది.

# లాభాల బాటలో ఆర్.టి.సి కార్యనిర్వాహక సంచాలకులు అన్సారీ



శ్రీకాకుళం : ఉద్యోగులందరూ సమిష్టిగా పనిచేసి ఆర్.టి.సిని లాభాల బాటలో నడిపించేందుకు కృషిచేస్తున్నట్లు ఆర్.టి.సి. విజయనగరం జోన్ కార్యనిర్వాహక సంచాలకులు డా యస్.ఎ.అన్సారీ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆర్.టి.సి చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జోన్ కార్యనిర్వాహక సంచాలకులుగా ఇటీవలే పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలు ఈ పరిధిలోకి వస్తాయన్నారు. జోన్ పరంగా చూస్తే గతేడాది ఫిబ్రవరి నాటికి రూ.177 కోట్ల నష్టాల్లో ఉందని దాన్ని రూ.77 కోట్లకు తగ్గించి, రూ.100 కోట్ల లాభాల బాటలో ఆర్.టి.సి పయనిస్తుందని చెప్పారు. నష్టాలకు ముగింపు పలికి లాభాలో బాటలో ఆర్.టి.సిని పయనించేందుకు సి.యల్.ఎ.పి అనే నినాదంతో ప్రణాళికను సిద్ధం చేసినట్లు ఆయన చెప్పారు. దీనిద్వారా ప్రయాణీకులకు మరింత దగ్గరగా ఆర్.టి.సిని చేరవేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 70 శాతం మంది ప్రయాణీకులు ఆర్.టి.సిలో ప్రయాణించడం జరుగుతుందని, ఆ శాతాన్ని మరింత పెంచేదిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఆర్.టి.సి బస్సులలో ప్రయాణం సుఖవంతం, సురక్షితమనే విషయాన్ని ప్రయాణీకులు గుర్తించాలన్నారు. ఆర్.టి.సి బస్సులలో ప్రయాణీకులు ప్రయాణించడం ద్వారా వచ్చే లాభాలను తిరిగి ప్రయాణీకులకే ఖర్చుచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జోన్ అభివృద్ధిలో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పరిధిలోని 55 ఎక్స్ ప్రెస్ బస్సుల ను డీలక్స్, అల్ట్రా డీలక్స్ లుగా అప్ గ్రేడ్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతీ బస్సు స్టేషనులలో మౌలిక వసతులను కల్పిస్తున్నామని, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు వంటి సదుపాయాలు ఇప్పటికే కల్పించడం జరిగిందన్నారు.

అంతేకాకుండా వేసవి దృష్ట్యా ఆర్డినరీ బస్సులలో కూల్ మేట్ లను కూడా ఏర్పాటుచేసామని చెప్పారు. జోన్ పరిధిలోని సుమారు 12,050 మంది ఉద్యోగులు ఆర్.టి.సికి సేవలు అందిస్తున్నారని, వారందరినీ ఒకేతాటిపై తీసుకువచ్చి పూర్తిగా నష్టాలను నివారించి లాభాలో బాటలో పయనించేందుకు తామంతా కృషిచేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ మేనేజర్ ఎ.అప్పలరాజు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ప్రజా సంబంధాల అధికారి బి.యల్.పి.రావు తదితరులు పాల్గొన్నారు.

# 21న 6వ తరగతి నవోదయ పరీక్ష

యానాం : జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం. అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి యానాం ప్రాంతానికి చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మిగిలిన వివరాలకు ఆఫీసు వేళలో అధికారులను సంప్రదించాలన్నారు.

## సత్యశోధకులు..జ్యోతిరావు పూలే : లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



విజయనగరం : అంటరానివారి వెంట ఉండి వారికి అండదంలు అందించి వారి కోసం జీవితాన్ని ధారపోసిన సత్యశోధకులు జ్యోతిరాం పూలే అని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. స్థానిక కలక్టరేట్ కూడలి వద్ద జ్యోతిరాం పూలే 192వ జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1873లో పూలే సత్యశోదక్ సమాజ్‌ను ప్రారంభించారని కులవివక్షతను రూపుమాపేందుకు కృషి చేశారని తెలిపారు. ఒక వైపు దరాచార నిర్మూలనపై ఉద్యమిస్తూనే వ్యాపారవేత్తగా కొంతకాలం, వ్యవసాయం చేస్తూ కొంతకాలం జీవనం సాగించారని తెలిపారు. తదుపరి మున్సిపల్ కాంట్రాక్టర్‌గా పనులు నిర్వహిస్తూనే 1876-83 మధ్యకాలంలో మున్సిపల్ కార్పరేషన్ కమీషనర్‌గా నియమితులై అనేకమార్పులను కుల వివక్షతపై తెచ్చారని పేర్కొన్నారు. జయంతిని పురప్కరించుకుని వారి విగ్రహం వద్ద మొక్కలు నాటారు.

పర్యావరణానికి పెద్ద పట వేసిన ఆయన స్ఫూర్తి తీసుకోవాలని పార్టీ కార్యదర్శి కె.ఏ.రాము కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అద్దె వాహనదారుల యజమానుల డ్రైవర్ల సంఘం ప్రతినిధులు,పార్టీ ప్రతినిధులు బి.ఉమ, పి.సంతోష్, చంద్రమోహన్, రమేష్‌నాయుడు, మురళీ, వెంకటేష్, నర్సింగరావు, ప్రకాష్, భాస్కర్, రాజారావు, భూషణం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదాతోనే..పురోగతి

### పార్లమెంటు మాజీ సభ్యురాలు డా॥ శ్రీమతి బొత్స ఝాన్సీలక్ష్మి



విజయనగరం: పార్లమెంటు మాజీ సభ్యురాలు డా॥ శ్రీమతి బొత్స ఝాన్సీలక్ష్మి జన్మదిన సందర్భంగా వై.యస్సార్.కాంగ్రెస్ పార్టీ యువజననాయకులు అవనాపు విక్రమ్, అవనాపు విజయ్‌లతో పాటు మ్యున్సిపల్ కౌన్సిలరు శ్రీమతి పిలకా దేవి, పార్టీ నాయకులు ఒమ్మిశ్రీను, పిలకా శ్రీను, ముల్లు త్రినాధ్, పతివాడ వెంకటరావు, మహంతి గణపతి, రౌతు చంటి, దత్తి సోమునాయుడు, పైల పెద్ద , రామ్ము,పృధ్వి, కర్రోతు నారాయణ, గడి బుజ్జి, రెడ్డి వెంకటేష్, బలగం నాయుడులు శ్రీమతి ఝాన్సీలక్ష్మిని కలిసి జన్మదినశుభాకాంక్షలు తెలిపారు.అవనాపు సోదరులు శ్రీమతి ఝాన్సీలక్ష్మితో బర్త్‌డే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భముగా డా॥ ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ విభజన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రానికి ప్రత్యేకహెూదా ఒక్కటే ఏకైక మార్గమని దీనిని సాధించడానికి వైకాపా కార్యకర్తలు కృషి చేయాలని ఆమె కోరారు. ప్రత్యేకహెూదా వస్తే పరిశ్రమలు వస్తాయని, యువత, నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతారని ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మనమంతా ప్రత్యేకహెూదా కోసం పోరాడుదామన్నారు.

అంతకుముందు గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మెన్ రొంగలి పోతన్న , వైసిపి నాయకులు డోల మన్మధకుమార్, కనకల రఘురామారావులు డా॥ శ్రీమతి ఝాన్సీలక్ష్మిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ బిసి విభాగం అధ్యక్షులు లంకసూరి అప్పారావు

విజయనగరం : మహాత్మా జ్యోతిరావు పూల ఆశయాలకు, ఆలోచనలకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ బిసి విభాగం అధ్యక్షులు లంక సూరిఅప్పారావు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే 192వ జయంతి ఉత్సవాలు పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ ఆఫీసు సమీపంలో గల జ్యోతిరావు పూల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ఎక్కువమంది ముఖ్యమంత్రులు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఆనాటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 1989వ సంవత్సరంలో మండల కమిషన్ ద్వారా ఓబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పనకు పోరాటం చేయడం జరిగిందన్నారు. ఎఐసిసి అధ్యక్షులుగా అనేక మంది ఓబిసి నాయకులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. కాపులకు బిసిడి హెూదా కల్పనకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో వుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహంతి అప్పలనాయుడు, బొంగ భానుమూర్తి, డోల శ్రీనివాసరావు, శేనమనేటి శ్రీనివాసరావు, షైక్ ఖలీల్, సుంకరి కుమార్, దాసరి ఈశ్వరరావు, లావేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కులాల మధ్య తారతమ్యాన్ని తగ్గించిన మహెూన్నతుడు పూలే

### శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం

రావులపాలెం : మండల పరిధి దేవరపల్లి శివారు చెల్లిరేవులో 192 వ పూలే జయంతి వేడుకలు స్థానికులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిధిగా పాల్గొని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ కులాల మధ్య తారతమ్యాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారాన్ని భావితరాలకు అందించిన మహెూన్నత వ్యక్తి పూలే అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఏఎమ్‌సి చైర్మన్ బండారు వెంకట సత్తిబాబు, పితాని శ్రీను, చిట్టూరి శ్రీనివాస్, వాసంశెట్టి సత్యనారాయణ, సానబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాలకు ఆత్మస్థైర్యాన్ని నింపిన వ్యక్తి పూలే

### ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

### ఘనంగా జోతీరావ్‌పూలే 192 వ జయంతి



రావులపాలెం : బడుగు బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నెలకొల్పిన పూలే చిరస్మరణీయులు అని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్సీపి కార్యాలయం వద్ద జోతీరావు పూలే 192 వ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా చిర్ల మాట్లాడుతూ భారత ప్రప్రధమ సామాజిక తత్వవేత్త, కులం పేరుతో తరతరాలుగా, అన్ని రకాలుగా అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాలకు ఆత్మస్థైర్యం కల్గించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావ్ గోవిందరావు పూలే అన్నారు. ఆయన సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు అని కొనియాడారు. భారతదేశంలో కుల వివక్షతకు వ్యతిరేకంగా కోట్లాది మంది పేద, అణగారిన అంటరాని ప్రజల హక్కుల కోసం పోరాడిన ఒకే వ్యక్తి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిపి కోట చెల్లయ్య, రాష్ట్ర వైసిపి కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, ఎమ్‌పిటిసి కొండేపూడి రామకృష్ణ, దొమ్మేటి అర్జునరావు, బొక్కా వెంకటలక్ష్మి అభిమానులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్‌పిపి కోట చెల్లయ్య అధ్యక్షతన బుధవారం మహాత్మా జ్యోతీరావ్‌పూలే 192వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్‌పిపి కోట చెల్లయ్య మాట్లాడుతూ నేటి యువత పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహెూన్నత వ్యక్తి జ్యోతీరావ్ పూలే అని కొనియాడారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

### రాష్ట్ర భూగర్భ గనుల శాఖామంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

విజయనగరం : మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అనగారిన వారికి, వెనుకబడిన వర్గాల వారికి బడుగు బలహీనవర్గాలకు అభ్యున్నతికి చేసిన కృషి చేశారని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రభూగర్భ గనుల శాఖామంత్రి ఆర్‌విఎస్‌కె రంగారావు పిలుపునిచ్చారు. బుధవారం మహాత్మాజ్యోతిరావు పూలే 192వ జయంతి ఉత్సవాల సందర్భంగా వెనుకబడిన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలకు విద్య ఎంతో అవసరమని, మహిళల కోసం ఎన్నో పాఠశాలలను ప్రారంభించి విద్యను మహిళలకు అందుబాటులోకి తేవడానికి కృషి చేశారని మంత్రి కొనియాడారు. మహిళలు సమాజంలో మంచి స్థానం పొందేందుకు ఆయన పోరాడారని తెలిపారు. వితంతువులకు పునర్వివాహాలను ప్రోత్సహించి బాల్య వివాహాలను అరికట్టారని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే అనేక విధాలుగా ఆదర్శవంతమైన వ్యక్తిగా ఉన్నారని, ఆయన జన్మించి 192 సంవత్సరాలైన ఆయనను స్మరించుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, వాటిని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని మంత్రి సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈ కార్యక్రమం గ్రామస్థాయి నుండి పై స్థాయి వరకు సక్రమంగా అమలయ్యే విధంగా అందరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి వెనుకబడిన తరగతుల వారికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడం కోసం పూలే ఎంతగానో కృషి చేశారని ఆయన అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే కాలంలో అంటరానితనం, అవిద్య ఉండేవని వాటి నిర్మూలనకు ఎంతగానో పోరాడారని ఆయన తెలిపారు. మహిళల విద్యను ప్రోత్సహించేందుకు అనేక విధాలుగా కృషి చేశారన్నారు. అనేక పాఠశాలలను ప్రారంభించి మహిళలకు విద్యను అందించారని, పూలే తన భార్యను మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా చేసి సమాజానికి ఆదర్శవంతంగా నిలిచారని ఆయన అన్నారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, బిసి వసతిగృహాలు, కళాశాల వసతిగృహాలు ఏర్పాటు, ఫ్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు మంజూరు, వివిధ పథకాల క్రింద ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలను ప్రజల మనసుల్లో ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. మహిళల విద్య కొరకు పాఠశాలలు ప్రారంభించడం జరిగిందని, వసతిగృహాల ఏర్పాటుకు కృషి చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్-2 కె.నాగేశ్వరరావు, జడ్పీ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ కుష్బు కొఠారి, బిసి కార్పొరేషన్ ఇడి నాగమణి, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరావు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బిసి కార్పొరేషన్ ద్వారా రూ.4,97,60,235 విలువైన 235 యూనిట్లను లబ్ధిదారులకు మంత్రి ఆర్‌విఎస్‌కె రంగారావు జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అందించారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతకు ముందు కలెక్టరేట్ సమీపంలో వున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జెసి, మున్సిపల్ చైర్మన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఘనంగా మహాత్మా జోతిరావ్ పూలే 192 జయంతి వేడుకలు



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక రైల్వేస్టేషన్ రోడ్డు నందు ఉన్న రావిచెట్టు సెంటర్ నందు బడుగు, బలహీన, అణగారిన వర్గాల ఆశా జ్యోతి మహాత్మ జ్యోతీరావ్ పూలే 192వ జయంతి సందర్భంగా నూతనంగా నిర్మించిన మహాత్మా జోతీరావ్ పూలే విగ్రహమును అన్నవరం గ్రామ ప్రెసిడెంట్ శ్రీమతి రాజాల. గంగాభవాని ప్రారంభించారు. అయితే విగ్రహ దాతలు లేటు దారా. పెంటయ్య, అప్పలకొండలు కాగా విగ్రహ నిర్మాణం దారా. వెంకటరమణ, ఈర్లు శ్రీనివాస్ గార్ల ఆద్వర్యంలో నిర్మించడం జరిగింది. గ్రామ పెద్దలు శెట్టిబత్తుల. కుమార్ రాజా, వైయస్ఆర్ మూర్తి,వీర్ల. సూరిబాబు, వీర్ల.సూరిబాబు, బొమ్మిడి. సత్తిబాబు, మడ్డు. వీరబాబు, బలువు. రాంబాబు, సరమర్ల. మధుబాబు, గుల్లా.దాసు, రాయి. శ్రీను, బండారు. సురేష్, కొత్తపల్లి. శ్రీను,బండారు. రాంబాబు, రాజాల. చిట్టిబాబు, ఇండుగబల్లి. నూకరాజు, లెక్చరర్ వెంకట్,రవి మాష్టారు జెడ్ పి స్కూల్ హెడా మాష్టారు,అమలాపురం. సత్తిబాబు తదితరులు పాల్గొని పూలే విగ్రహనికి పూలమాలలు వెసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచి రాజాల.గంగాభవాని మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం జ్యోతీరావ్ పూలే చేసిన సేవలు మహోన్నతమైనవని గుర్తుచేసారు.అలాగే మనువాదుల కుతంత్రాలను ఎండగట్టడానికి.. చీకటి శాసనాలతో ప్రజలను దోచుకుంటున్న తీరును తుద ముట్టించడమే లక్ష్యంగా తన కార్యాచరణను ప్రకటించిన పూలే ఆ దిశగా ఎనలేని కృషి చేశారన్నారు. ప్రతి రంగంలో స్త్రీలను అణగదొక్కిన తీరుపై పూలే పోరాడారన్నారు.

అలాగే కులపరమైన అణచివేతకు వ్యతిరేకంగా తీవ్రమైన కృషి చేశారన్నారు.అణగారిన వర్గాల హక్కుల కోసం వారి బానిసత్వ విముక్తి కోసం పోరాడిన ధీరోదాత్తుడు జ్యతీరావ్ పూలే అని అన్నారు.ఈ సందర్భంగా విగ్రహ దాతల కుమారుడు దారా.వెంకటరమణ దంపతులను పూల మాలలు వెసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### ప్రత్యేకహెూదా పోరులో

## వై.సి.పి రైల్‌రోకో.. పలువురు అరెస్ట్




విజయనగరం: రాష్ట్రానికి ప్రత్యేకహెూదా విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని ప్రజల ఆకాంక్ష, రాష్ట్ర ప్రయోజనాలు కొరకు ప్రత్యేకహెూదా సాధించే వరకు వై.యస్సార్.కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని వైసిపి ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, సాలూరు,కురుపాం ఎమ్మెల్యేలు పి.రాజన్నదొర,శ్రీమతి పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా రాజకీయవ్యవహారాల సమన్వమకర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను), విజయనగరం , అరకు పార్లమెంట్ నియోజకవర్గాల అద్యక్షులు బెల్లాన చంద్రశేఖర్, ఎస్ పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్యలు స్పష్టం చేశారు.

పార్టీ ఆదేశం మేరకు బుధవారం జిల్లా వై.యస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రైలు రోకో కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోడి రాష్ట్రానికి ప్రత్యేకహెూదా ఇస్తామని తిరుపతి సభలో చెప్పి మాట మార్చడాన్ని సరికాదని , అందుకనే కేంద్రప్రభుత్వ సంస్థలు ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలు అసంతృప్తిని తెలియ జేస్తున్నామన్నారు.ఇప్పటికైనా కేంద్రం దిగివచ్చి రాష్ట్రానికి ప్రత్యేకహెూదా ఇచ్చి తీరాలని వారు డిమాండు చేశారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకహెూదాకోసం పోరాడు తున్నామని చెప్తూ , వైయస్సార్.కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రైల్‌రోకో కార్యక్రమం భగ్నం చేస్తూ, పోలీసులను ఉసిగొల్పుతున్నారని మొదటినుంచి ఆయనకు ప్రత్యేకహెూదాపై చిత్తశుద్ధి లేదని వారు పేర్నొన్నారు. ప్రత్యేకహెూదా కోసం తాము ఎటువంటి త్యాగాలకైన సిద్ధమని, వై.యస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో హెూదా సాధిస్తామని వారు పేర్నొన్నారు. రైలు రోకో కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక ఆర్.కె.అతిధి గృహం ప్రాంగణానికి జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకొన్నారు.రైల్‌రోకో కార్యక్రమాన్ని భగ్నం చేసేటందుకు పోలీసులు చేసిన ప్రయత్నాన్ని వైసిపి శ్రేణులు వ్యూహాత్మకంగా త్రిప్పికొట్టి వందలాది మంది స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లి రైళ్లను నిలుపుదల చేశారు. ఒక దశలో పోలీసులకు , కార్యకర్తలకు మద్య వాగ్యుద్ధం జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలకు మేము దేనికైనా సిద్ధమేనని అరెస్టులకు భయపడేదిలేదని వైసిపి కార్యకర్తలు ముందుకు నడిచారు. ఈ కార్యక్రమంలో డిసి.ఎమ్.ఎస్.చైర్మెన్ ఎస్.వి.రమణరాజు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కె.వి.సూర్యనారాయణరాజు, పార్వతీపురం నియోజకవర్గ సమన్వయకర్త అలజంగి జోగారావు, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఉప్పాడ సూర్యనారాయణ, ఆర్.ఇ.సి.ఎస్.మాజీ చైర్మెన్ పొన్నాడ వెంకటరమణ,మాజీ గ్రంధాలయ చైర్మెన్ రొంగలి పోతన్న ,మాజీ ఎం.పి.పి.తాడి వేణుగోపాలరావు, మాజీ జెడ్పీటీసి మంత్రి అప్పలనాయుడు, పతివాడ అప్పలనాయుడు, పట్టణ పార్టీ అద్యక్షుడు ఆశపువేణు, మ్యున్సిపల్ కౌన్సిలర్స్ వి.వి.రాజేష్,రాంపండు, ఎం.ఎల్.ఎన్.రాజు, బంగారునాయుడు, ఎస్సీ సెల్ చైర్మెన్ జైహింద్‌కుమార్,మామిడి ఈశ్వరరావు, డోల మన్మధకుమార్, కనకల రఘురామారావు, ఒమ్మి శ్రీను, పిలకా శ్రీను, ముల్లు త్రినాధ్, పతివాడ వెంకటరావు, మహంతి గణపతి,రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ శాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తా

## డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన డైరెక్టర్ శోభా హైమావతి

విశాఖపట్నంః దేశంలో అధిక శాతం నష్టాలలో ఉన్న కార్పొరేషన్ల కన్న విశాఖ ఏపీఈపీడీసీఎల్ అతి తక్కువ నష్టాలతో నడుస్తున్న ఐకైక సంస్థ అని ఇటీవల డైరెక్టర్‌గా నియామకమైన శోభా హైమావతి పేర్కొన్నారు. బుధవారం ఆమె ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో మొదటి సారిగా ప్రమాణ స్వీకారం చేస్తూ తనపై ఏపీ సీఎం చంద్రబాబు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంస్థను అభివృద్ధి




పథంలో నడిపించేందకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ్ కృష్ణ రంగారావు మాట్లాడుతూ గతంలో ఎస్‌కోట నియోజకవర్గంలో రాజకీయ రంగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన ధీశాలి ఈమె అన్నారు. ఈనాడు విద్యుత్ రంగంలో డైరెక్టర్‌గా ఆమెను నియమించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమెపై ఉన్న నమ్మకమే ప్రధాన కారణం అన్నారు. విద్యుత్ రంగంలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించి వాటి లోపాలను సవంరించి సంస్థ ఉన్నతాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె హామీ ఇవ్వడాన్ని అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర, వాసుపల్లి గణేష్ కుమార్, విష్ణుకుమార్ రాజు, విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ శంకర్, స్వాతి రాణి, బాబ్జి, జగదీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# చందనయాత్ర టిక్కెట్ల విక్రయాలు నేటినుంచి ప్రారంభం



సింహాచలంః సింహాద్రి అప్పన్న చందనోత్సవం ఈ నెల 18 న జరగనున్న నేపథ్యంలో దేవస్థానం ఈ ఓ కె రామచంద్రమోహన్ వివిద బ్యాంకుల అదికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసి క్రిందిబ్యాంక్లకు 200 ,500 రూపాయల టిక్కెట్లు అమ్ముటకు ఆదేశాలు ఇచ్చారు బ్యాంకుల పని గంటలలో వెళ్లి ఆయా శాఖలలో ప్రజలు చందనోత్సవం టికెట్లు పొందవచ్చు ఈ టికెట్లు కొనుగోలుచేసిన భక్తులు ఉ 4 గం ల నుండి సాయంత్రం 6 గం ల లోపు దర్శనం చేసుకోవచ్చును అంతేకాక ఈ టికెట్లు దేవస్థానం పెట్రోల్ బంక్ గోపాలపట్నం మరియు కొండపైన సమాచార కార్యాలయంనందుకూడా పొందవచు 18 వ తేదిన క్రింద అడివివరం పాతగోశాల పార్కింగ్ స్థలమందు కొండపైన క్యూ లైన్స్ వద్దకూడా లభించును అని దేవస్థానం అదికారులు తెలిపారు .

టికెట్లు దొరుకు బ్యాంకుల వివరాలు ఆంధ్రాబ్యాంక్:- సింహాచలం ,టౌన్ కొత్తరోడ్డు ,ఏ యూ ,ద్వారకానగర్ ,స్టీల్ ప్లాంట్ టౌన్షిప్ ,అక్కయ్యపాలెం ,మహారాణిపేట ,వాల్తేరు ,సీతమ్మధార ,పితాపురం కాలనీ ,గాజువాక ,ఈస్టపోయింట్ కాలనీ ,ఎంవిపి కాలనీ , మధురవాడ ,మురళీనగర్ ,

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ :- అడివివరం ,పూర్ణామార్కెట్ ,చిన్నముసిడివాడ ,బాజీ జంక్షన్ ,ఎంవిపి ,కంచరపాలెం ,అక్కయ్యపాలెం ,డాబాగార్డెన్స్ ,హెచ్ బి కాలనీ ,సీతమ్మపేట ,అనకాపల్లి ,అచుతాపురం ,నాతయ్యపాలెం ,ఆరిలోవ ,లంకిలపాలెం ,శ్రీహరిపురం ,మద్దిలపాలెం ,విజయనగరం మెయిన్ బ్రాంచ్

ఎస్ బి ఐ :-సింహాచలం ,గొపాలపట్నం , కిర్లంపూడి లేఔట్ ,మహరాణిపేట ,విశాఖపట్నం మెయిన్ బ్రాంచి ,ద్వారకానగర్ ,దొండపర్తి ,సీతమ్మధార ,సిరిపురం ,ఎంవిపి కాలనీ ,వేపగుంట ,యెన్ ఏ డి ,ఇండస్ట్రియల్ ఎస్టేట్ ,బిర్లా జంక్షన్ ,మల్కాపురం ,బి హె చ్ పి వి ,గాజువాక ,స్టీల్ ప్లాంటు ,పెందుర్తి ,ప్రహ్లాదపురం ,ఐటి ఐ జంక్షన్ ,సూర్యబాగ్ జగదాంబ జంక్షన్

ఇండియన్ బ్యాంక్ :-గోపాలపట్నం ,మాధవధార ,సీతమ్మధార ,సీతమ్మపేట ,లంకవానిపాలెం ,పెందుర్తి

ఆక్సిస్ బ్యాంక్ :-గోపాలపట్నం

కరూర్ వైశ్య బ్యాంకు :-విశాఖపట్నం బ్రాంచిలలో టికెట్లు దొరుకును

# ఎయు ఇంజనీరింగ్ మైదానంలో నేడు

## బహుబలి త్రీ ఎగ్జిబిషన్ ప్రారంభం - 22 రైడ్స్, 100 స్టాల్స్ ఏర్పాటు



విశాఖపట్నం : నగర వాసులను అలరించేందుకు రూట్ 360 బహుబలి త్రీ ఎగ్జిబిషన్ సిద్దమైంది. ఎయు ఇంజనీరింగ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రధాన ద్వారం అందరిని అకట్టుకునే విధంగా బహుబలి సెట్ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా బుధవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఎగ్జిబిషన్ నిర్వహకులు మహ్మద్ జాకీర్ మాట్లాడతూ ఈ నెల 12వ తేదీ సాయంత్రం ప్రదర్శన ప్రారంభమైవుతుందన్నారు. ప్రదర్శనను ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్యులు జి నాగేశ్వరావు ప్రారంభిస్తారని చెప్పారు. 60 రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో 100 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందిన్నారు. జెయింట్ వీల్, రివైలింగ్ టవర్, మేరీ గ్రాండ్ ,కప్ అండ్ సాసర్, ఎంజి రౌండ్, డ్రాగన్ ట్రైన్, ఫ్రీజ్ బి ,కొలంబస్ వంటి 22 రైడ్స్ ఏర్పాటు చేశామన్నారు. డబుల్ రేంజర్ 360 వంటి గేమ్స్ , చిన్నారుల రైడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయిన్నారు. ఈ సారి కొత్తగా లవీంగ్ యువర్ పుట్ పేరిట పిష్ ట్రీట్‌మెంట్ ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. వీటితో పాటు విభిన్న రుచులు కల్గిన పుడ్ స్టాల్స్ ,రష్యా నుంచి దిగుమతి చేసిన గృహాలంకరణ సామాగ్రి స్టాల్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయడమైందన్నారు.

వినోదాన్ని పంచే ఎన్నో కార్యక్రమాలు వున్నాయిని తెలిపారు. విలేకర్ల సమావేశంలో ప్రదర్శన నిర్వహకులు దినేష్ వర్మ, దివ్య వర్మ, రవి వర్మ తదితరులు పాల్గోన్నారు.

## వైజాగ్, హైదరాబాద్‌లలో ఐపీఎల్ మ్యాచ్‌లు?

న్యూఢిల్లీ : తమిళుల నిరసనల నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లను హైదరాబాద్, వైజాగ్‌లలో నిర్వహించేందుకు ఆలోచిస్తున్నట్లు సమాచారం. బుధవారం జరుగుతున్న బీసీసీఐ-ఐపీఎల్ అత్యున్నత స్థాయి సమావేశంలో వారం నుంచి తమిళనాడులో జరుగుతున్న నిరసనలను, చెన్నైలో పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. భద్రతా కారణాలతో చెన్నైలో జరగవలసిన 6 ఐపీఎల్ మ్యాచ్‌లను వేరొక చోటుకు తరలించాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్, వైజాగ్‌లలోని మైదానాలు, భద్రత పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు సమాచారం.



కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో నగర కాంగ్రెస్ కమిటీ బీసీ సెల్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 192వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కొణతాల శ్రీనివాస్, కె. తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రీక్వార్టర్స్‌లోకి సైనా, సింధూ...

గోల్డ్‌కోస్ట్: కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్ల హవా కొనసాగుతోంది. స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధూ ప్రీక్వార్టర్స్‌లోని అడుగుపెట్టారు. ఇవాళ కరారా స్పోర్ట్స్ అరేనాలో జరిగిన ఉమెన్స్ సింగిల్స్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా క్రీడాకారిణి ఎల్సీ డీవిలియర్స్‌పై సైనా నెహ్వాల్ అలవోకగా విజయం సాధించింది. లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అయిన సైనా... సౌతాఫ్రికా క్రీడాకారిణిపై 21-3, 21-1 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. కేవలం 18 నిమిషాల్లో తనదైన శైలిలో ఆట ముగించి ప్రీక్వార్ట్స్‌లోకి దూసుకెళ్లింది. ఇక కీలకమైన క్వార్టర్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టేందుకు సైనా ఐల్ ఆఫ్ మాన్‌కు చెందిన జెస్సికా లీతో తలపడనుంది. కాగా మరో ఉమెన్స్ సింగిల్స్ మ్యాచ్‌లో రియో ఒలింపిక్ రజత పతక విజేత పీవీ సింధూ దుమ్ము‌రేపింది. ఫిజికి చెందిన ఆండ్రా వైట్‌సైడ్‌పై 21-6, 21-3 తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ కూడా కేవలం 18 నిముషాల్లో ముగియడం విశేషం.

మరోవైపు మెన్స్ సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ కూడా ప్రీక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టాడు.

26 నిమిషాలు పాటు సాగిన ఈ మ్యాచ్‌లో మారిషస్‌కి చెందిన ఆటిష్ లూబాపై 21-13, 21-10 తేడాతో శ్రీకాంత్ విజయం సాధించాడు. తర్వాతి రౌండ్‌లో శ్రీకాంత్ శ్రీలంక క్రీడాకారుడు నీలుక కరుణరత్నేతో తలపడనున్నాడు.

తాజా కామన్వెల్త్ క్రీడా సంగ్రామంలో భారత అథ్లెట్లు ఇప్పటి వరకు 24 పతకాలు సాధించగా.. అందులో 12 బంగారు పతకాలు, నాలుగు రజతాలు, ఎనిమిది కాంస్య పతకాలు ఉన్నాయి.

# జబర్దస్త్ టీం హల్‌చల్



మాధవధార : మాధవధార ప్రాంతంలో జబర్‌దస్త్ టిం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా 48ఎ బస్‌స్టాప్ వద్ద ఇటివల డివైఎఫ్ఐ ఎర్పాటు చేసిన చలివేంద్రాన్ని తిలకించారు. అనంతరం బస్‌స్టాప్ వద్దకు వచ్చిన ప్రజలకు మజ్జిక, మంచినీటిని అందజేశారు. ఈ సందర్భంగా జబదస్త్ టీం రాకేట్ రాఘవ మాట్లాడుతూ వేసవికాలంలో చలివేంద్రాలు వల్ల ఎంతో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. ప్రజలు వేసవి తాపానికి గురికాకుండా ఇటువంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో చలివేంద్రాలు ఎర్పాటు చేయ్యాలని వివిద సేవా సంస్థలను కోరారు. ఈ సందర్భంగా జబర్‌దస్త్ టింను చూసేందుకు ప్రజలు అక్కడకు చేరుకోవడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో జబర్‌దస్త్ టిం రాజమౌళి, లోకల్ జబర్‌దస్త్ సనపల రమేష్‌లు పాల్గొన్నారు.

# గీతం ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ప్రారంభం

## దేశ వ్యాప్తంగా 48 కేంద్రాలలో ఏప్రిల్ 26 వరకు నిర్వహణ




సాగర్‌నగర్ః గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరా బాద్, బెంగళూరు ప్రాంగణా లలో ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కి టెక్చర్ కోర్సులలో ప్రవేశానికి గాను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్ట్ - 2018 దేశంలోని 48 పట్టణాలలో బుధవారం తేది: 11-04-2018 న ప్రారంభమైంది. విశాఖలోని గీతం ప్రాంగణంలో ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఈ-పేపర్ ను వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు బుదవారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఏప్రిల్ 26వ తేది వరకు జరిగే ఈ ప్రవేశ పరీక్షకు దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వీరికి ఆన్‌లైన్ విధానంలో స్లాట్ బుకింగ్ ద్వారా హాల్‌టికెట్లు పంపిణీ చేశామని అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, కడప, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, తాడేపల్లిగూడేం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం లలో పరీక్షా కేంద్రాలను, తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రెండు గంటల కాలవ్యవధి గల ప్రవేశ పరీక్ష 400 మార్కులకు ఉంటుందని తప్పు సమాధానానికి ఒక మార్కును తీసివేయటం జరుగుతుందన్నారు. ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఏప్రిల్ 30వ తేదిన ప్రకటిస్తామని, అనంతరం అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలను తెలియజేస్తామన్నారు.

### టాప్ ర్యాంకర్లకు ఉచిత విద్య:

గీతం ప్రవేశ పరీక్షలో మొదటి 10 ర్యాంకర్లకు ఉచిత విద్య అందిస్తామని, 11 నుంచి 100 ర్యాంకు వరకు లభించిన విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని వెల్లడించారు. గీతం ప్రవేశపరీక్షలో విద్యార్థులకు లభించిన ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ లోనూ, కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కర్ణాటక విద్యార్థులకు 25 శాతం సీట్లు బెంగళూరు కేంపస్‌లో ప్రతిభ ఆదారంగా భర్తి చేస్తామన్నారు.

కార్యక్రమంలో ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.గణపతి, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరక్టర్ ప్రొఫెసర్ మోహన్, సిఎస్ఇ విభాగం అధిపతి డాక్టర్ తమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కామన్‌వెల్త్ బాక్సింగ్..

# ఫైనల్లో మేరీ కోమ్



గోల్డ్ కోస్ట్ : కామన్‌వెల్త్ గేమ్స్ బాక్సింగ్‌లో మేరీ కోమ్ ఫైనల్లో ప్రవేశించింది. 48 కేజీల విభాగంలో ఆమె బుధవారం శ్రీలంకకు చెందిన అనుషా దిల్‌రుక్షిను ఓడించింది. అనుభవం, టెక్నిక్‌తో మేరీ అత్యద్భుత ప్రదర్శన కనబరిచింది. రస వత్తరంగా సాగిన బౌట్‌లో 5-0 తేడాతో శ్రీలంక ఫైటర్‌ను మట్టికరిపించింది. అయిదుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన మేరీ కోమ్ మొదట్లో లంక బాక్సర్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్నది. మొదటి రౌండ్‌లో ఇద్దరు బాక్సర్లు జాగ్రత్తగా ఆడారు. కానీ మేరీ మాత్రం మధ్యమధ్యలో తన పంచ్ పవర్ చూపించింది. రెండవ రౌండ్‌లో ఇద్దరూ సమానంగా నిలిచారు. కానీ మూడవ రౌండ్‌లో మేరీ కీలక పాయింట్లను రాబట్టింది. 60 కేజీల కేటగిరీలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మరో ఇండియన్ ప్లేయర్ సరితా దేవి ఆస్ట్రేలియా బాక్సర్ చేతిలో ఓడిపోయింది.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 Phone : 2564353, Fax : 0891-2569004 e-mail: vijayabhanudaily@gmail.com

# అన్ని వర్గాల అభివృద్ధే తెరాస ప్రభుత్వం అజెండా

## రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



తలమడుగు : రాష్ట్రంలో ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్న అన్నివర్గాలను అభివృద్ధి పరచాలన్న ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందని రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. తలమడుగు మండలం దేవాపూర్ గ్రామంలో గొర్రెల లబ్ధిదారులకు దాణా పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4,323 గొర్రెల యూనిట్లు మంజూరుకాగా అందులో 4,220 యూనిట్లు పంపిణీ చేయడంలో పశుసంవర్ధక శాఖ అధికారులు రామారావురాథోడ్, సురేశ్‌ల పాత్ర అభినందనీయమన్నారు. అనారోగ్య కారణాలతో మరణించిన 1900 గొర్రెలను త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గొర్రెలకు రెండు నెలల పాటు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే దాణాను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రూపొందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పకడ్బందీ అమలుతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు.

విద్యుత్తు సమస్యలను అధిగమించడం మొదలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉండటంతో తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆనాడు కాంగ్రెస్, భాజపాలు రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. చనఖా-కోర్ట ఆనకట్ట పనుల పూర్తితో జిల్లాలోని రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్‌స్థాయిలో విద్యను అందించేందుకు స్థానిక మంత్రి జోగురామన్న ఎంతో కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న గురుకులాలతోపాటు అదనంగా మరో 119 గురుకుల పాఠశాలలను మంజూరు చేయించిన ఘనత జోగురామన్నకే దక్కిందన్నారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళా లబ్ధిదారుతో తెలంగాణ ప్రభుత్వంతో మీకు జరిగిన అభివృద్ధి ఫలాలను వివరించమని చెప్పారు. ఆమె మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు మా లాంటి పేదలను పట్టించుకోలేదని కేవలం తెలంగాణ ప్రభుత్వమే ఆదుకుందని ఆనందం వ్యక్తం చేశారు.

గత పాలకుల స్వార్థ రాజకీయాలతోనే బీసీల వెనకబాటు: రామన్న అనంతరం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ గత పాలకుల స్వార్థ రాజకీయాల వల్లనే బీసీలు అభివృద్ధిలో వెనుకబడ్డారని పేర్కొన్నారు. కులాలకు చేయూత అందించడానికి తెరాస ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రజల హామీలన్నింటిని నెరవేరుస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 70 సంవత్సరాల పరిపాలనలో ప్రతిపక్షాలకు ప్రజా సంక్షేమం కనిపించలేదా ఎన్నికలు ఏడాది ఉండగానే గుర్తొస్తున్నాయా అని విమర్శించారు.

ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావు, రాష్ట్ర పాడిపరిశ్రమ సహకార అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు లోకభూమారెడ్డి మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటున్నా భాజపా ఆయా రాష్ట్రాల్లో ఎందుకు రుణమాఫీ చేయడంలేదని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల రాష్ట్ర ఛైర్మన్ రాజయ్య యాదవ్, సినీనిర్మాత రవికిరణ్‌యాదవ్, జిల్లా పాలనాధికారి దివ్య, సంయుక్త పాలనాధికారి కృష్ణారెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఆదిలాబాద్ మార్కెట్ ఛైర్మన్ ఆరె రాజన్న, పురపాలక ఛైర్‌పర్సన్ మనీషా, ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీపీ సిడాం రాములు, జక్కుల ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు రామారావురాథోడ్, రైతు సమన్వయకర్త కేదారేశ్వర్‌రెడ్డి, పడిగెల రాంచంద్రారెడ్డి, నాందేవ్‌యాదవ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# జన జాగృతం... సమైక్యతా నినాదం

## అవగాహన ర్యాలీలో కదిలిన సబ్బండ వర్ణాలు

లక్షెట్టిపేట : జాతీయ సమైక్యతను పెంపొందించి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే ఉద్దేశంతో లక్షెట్టిపేట పట్టణంలో ఈ నెల 14న ప్రారంభించనున్న సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతీయ గీతం ఔన్నత్యాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న సామూహిక జాతీయ గీతాలాపన సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై పట్టణ వాసులకు అవగాహన కల్పించే దిశగా మంగళవారం జిల్లా పరిషత బాలికోన్నత పాఠశాల నుంచి కోర్టు, పాత బస్టాండు మీదుగా గాంధీ చౌక్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

అన్ని వర్గాల ప్రజలు జాతీయ వాదాన్ని పెంపొందించే దిశగా ర్యాలీలో పాల్గొన్నారు. ముఖ్య కూడళ్లలో యువత, కాలనీ వాసులు, విద్యార్థులు, యువజన సంఘాలతో సమావేశాలు నిర్వహించి జాతీయ గీతాలాపన సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధలపై అవగాహన కల్పించారు. 30 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంపతి శ్రీనివాస్, సీఐ నాగపురి శ్రీనివాస్, ఎస్సై ఆది మధుసూధన్‌రావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.కిరణ్ కుమార్, ఎంఈవో కె.రవిందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు హెలెన్ డోరోతి, స్టీరింగ్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. సతీష్, కె.తిరుపతి, ఎండీ.గఫూర్, ఎ.శివ, తిరుపతి, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

# జీవాల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

నిర్మల్: జీవాల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయితీపై గొర్రెలకు మేత కోసం ఉచితంగా గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నామని, రాయితీతో సంబంధం లేని జీవాలకు 75 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. మత్స్యకారులను బలోపేతం చేసేందుకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. జలాశయాలు, చెరువులు, కుంటల్లో గతేడాది 55 కోట్ల చేప పిల్లలు వదిలిపెట్టామని, ఈ ఏడాది 80 కోట్ల పిల్లలను వదిలేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. చేపలు పట్టేవారందరినీ సహకార సంఘాల్లో సభ్యత్వం ఇవ్వాలని అధికారులకు ఆదేశించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ పనుల తీరుపై సీడబ్ల్యూసీ ఛైర్మన్ మసూద్ హుస్సేన్ ప్రశంసలు కురిపించిన విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ బస్సుయాత్ర కేవలం ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్యపెడుతుందన్నారు. ఈనెల 29న నిర్వహించే గొల్ల, కురుమ శంఖారావానికి అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకున్న తర్వాత మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి ఎం.ప్రశాంతిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# జ్యోతిరావు పూలేకు ప్రముఖుల నివాళి

కాచిగూడ: అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు మంత్రులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ శాఖ మంత్రి జోగురామన్న, మాజీ మంత్రి కృష్ణయాదవ్, కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ, భాజపా శాసనసభాపక్షనేత కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహరాల ఇంఛార్జి రామచంద్ర కుంతియా, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డి, మాజీ మంత్రి దానంనాగేందర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీమాస్ నేతలు తమ్మినేని వీరభద్రం, కంచె ఐలయ్య, సీపీఐ నేతలు చాడ వెంకటరెడ్డి, గెల్వయ్య, తెదేపా నగర అధ్యక్షుడు ఎంఎన్ శ్రీనివాస్‌రావు, వనం రమేష్, ఆయా పార్టీల నేతలు జ్యోతిరావు పూలేకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం పులువురు నేతలు మాట్లాడుతూ.. అందరికీ చదువు అందుబాటులోకి తెచ్చేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహిళల విద్య కోసం ఆయన తన భార్య సావిత్రిబాయి పూలే ద్వారా చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి: అదనపు డీసీపీ

## ఖమ్మం నగర శివారు వైఎస్సార్ కాలనీలో నిర్బంధ తనిఖీలు

## పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు, 15 ద్విచక్ర వాహనాలు

ఖమ్మం : ప్రతి ఒక్కరూ యూనిఫాం లేని పోలీసుల్లా వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఖమ్మం అదనపు డీసీపీ కొల్లు సురేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. విచ్ఛిన్నకర శక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారం తమకు అందించి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. ఖమ్మం పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఆదేశాల మేరకు ఖానాపురంహవేలి పోలీసు స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ నగర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఖమ్మం పట్టణ ఏసీపీ గణేశ్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి వారు ప్రసంగించారు. పోలీసులు ఇటువంటి కార్యక్రమాలను ప్రజలను ఇబ్బంది పెట్టే ఉద్దేశంతో చేయరని.. శాంతి భద్రతల పరిరక్షణకు చేపట్టే తనిఖీలకు ప్రజలు సైతం సహకరించాలన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విచ్ఛిన్నకర శక్తులు, తప్పించుకు తిరుగుతున్న నేరస్థులు స్థానికంగా నివాసం ఉంటున్నారా? అనేది గుర్తించేందుకు అప్పుడప్పుడు ఇలాంటి నిర్బంధ తనిఖీలు చేపట్టాల్సి వస్తోందన్నారు. స్థానికేతరులకు ఇల్లు అద్దెకు ఇచ్చేముందు వారి నుంచి సరైన ధ్రువపత్రాలు తీసుకోవాలని, కాలనీకి ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని పర్యవేక్షించాలని సూచించారు. ఎవరి ప్రవర్తనపైనైనా అనుమానం కలిగినా, కొత్తగా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే డయల్ 100కు గానీ, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తనిఖీలకు అందరూ సహకరించినందుకు సంతోషంగా ఉందన్నారు. యువత చదువుపై దృష్టిసారించాలన్నారు. సమాజంలో చదువుకున్న వారికి ఎక్కువ విలువ ఉంటుందని, యువత బంగారు భవితకు బాటలు వేసుకోవాలని అదనపు డీసీపీ సూచించారు. ఈ సందర్భంగా సీఐలు వెంకన్నబాబు, నాగేంద్రాచారి, రాజిరెడ్డి, రమేష్, అంజలి స్థానికులకు చట్టాలు, మహిళల రక్షణ, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలు, నేరాలు, ఆత్మహత్యలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలను వేధించే వారి సమాచారాన్ని షీ టీం నంబరు 94949 33940కు సమాచారం అందించాలని కోరారు.

### సమస్యల ఏకరువు..

ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రఘునాథపాలెం బైపాస్‌లో టిప్పర్ల వంటి భారీ వాహనాలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాయని, వాటివల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదు చేశారు. నియంత్రించాలని కోరారు. పండితాపురం సంతకు ప్రతి బుధవారం వెళ్లి, వచ్చే వాహనాలతో సమస్యగా ఉందన్నారు. స్థానికంగా కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, చిన్నపిల్లలు, పెద్దలు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. వాహన తనిఖీలు చేపడతామని, కుక్కల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు డీసీపీ, ఏసీపీలు కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

కాలనీలో పోలీసులు తెల్లవారుజామున 4 గంటల నుంచి 8 గంటల వరకు ఇంటింటి తనిఖీలు జరిపారు. నివాసం ఉంటున్న వారు, వారి వృత్తి, ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర గుర్తింపు కార్డులు వంటి వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు బయటకు వెళ్లకుండా, కాలనీలోకి బయటివారు రాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కాలనీ చెంతనున్న రఘునాథపాలెం బైపాస్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల పత్రాలను చూపిస్తే తిరిగి వారికి ఇవ్వడం జరుగుతుందని ఏసీపీ గణేశ్ తెలిపారు.

# కుమార్ విశ్వాస్‌కు కేజ్రీవాల్ షాక్

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు నలుగురు పార్టీ వ్యవస్థాపక నేతల్లో ఒకరైన కుమార్ విశ్వాస్‌కు గట్టి షాక్ తగిలింది. ఆయనను రాజస్థాన్‌లో పార్టీ కన్వీనర్ పదవి నుంచి తొలగించారు. పార్టీ నాయకత్వంపై తరచూ తిరుగుబాటు ప్రదర్శించే విశ్వాస్‌ను గత ఏడాది పార్టీ రాజస్థాన్ యూనిట్ అధ్యక్షుడిగా నియమించింది. అప్పుడు మనీష్ సిసోడియాను ఆప్ ఉప ముఖ్యమంత్రిగా నియమించడంతో ఆ పదవిని కుమార్ విశ్వాస్‌కు అప్పగించారు. అయితే ఇప్పుడు ఆయనను తొలగించి ఆ స్థానంలో దీపక్ బాజ్‌పేయిని నియమించింది. రాజస్థాన్‌లో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తామని ఈరోజు ప్రకటించిన ఆప్ రాష్ట్ర అధ్యక్షుడి పదవి దీపక్‌కు అప్పగిస్తూ తాజా నిర్ణయాన్ని వెల్లడించింది.

దీపక్ బాజ్‌పేయిని రాజస్థాన్ పార్టీ అధ్యక్షుడిగా నియమించాం, దీని వల్ల ఆయన అక్కడే ఉండి పార్టీని బలోపేతం చేసేందుకు, త్వరలో రాబోయే ఎన్నికలకు వ్యూహాలు రచించేందుకు సహాయ పడతారు అని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి అశుతోష్ వెల్లడించారు. కుమార్ విశ్వాస్ తన సమయాన్ని రాష్ట్రానికి కేటాయించలేకపోతున్నారని ఆప్ పేర్కొంది. కుమార్ విశ్వాస్ వేరే పనుల్లో నిమగ్నమై ఉంటున్నందున ఎన్నికల సన్నాహానికి సమయం కేటాయించట్లేదని తెలిపింది.

# రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం మెహబూబా భేటీ

న్యూఢిల్లీ : జమ్మూ-కశ్మీరు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఆ రాష్ట్రంలో పరిస్థితులపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో బుధవారం చర్చించారు. ఇటీవల ఆ రాష్ట్రంలో ఉగ్రవాద, హింసాత్మక సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి దినేశ్వర్ శర్మ వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించడంలో చూపుతున్న చొరవను వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను కూడా తెలిపారు. కశ్మీరు లోయలో శాంతి పునరుద్ధరణ చర్యలను వివరించారు. పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో ఉగ్రవాదుల చొరబాట్లు, సరిహద్దుల ఆవలి నుంచి కాల్పులు కూడా చర్చకు వచ్చాయి.

# ఎన్నికలకు వెళదామా!?

## ఎమ్మెల్యే ఆర్కే రోజా సవాలు

## రెండో రోజు నిర్వహిస్తున్న ఆనంద నగరాలు

హైదరాబాద్: ప్రత్యేక హోదా కోసం రాష్ట్రమంతటా ఆందోళనలు, ఆగ్రహావేశాలు పెల్లుబిగుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం ఆనంద నగరాలు పేరుతో వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా మండిపడ్డారు. ఇలాంటి పనికిమాలిన కార్యక్రమానికి తెలుగువారైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరుకావడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ పథకాలపై 71 శాతం మంది సంతృప్తిగా ఉన్నారన్న సీఎం వ్యాఖ్యలకు ఘాటు కౌంటర్ ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఎన్నికలకు వెళదామని సవాలు విసిరారు. బుధవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు.

టీడీపీ ప్రభుత్వ పథకాలపై 71శాతం సంతృప్తి ఉందట! రుణమాఫీ కాక రైతులు అప్పు లపాలైనందుకా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చినందుకా, ఇంటికో ఉద్యోగం, దళితులకు ఇళ్లు దక్కినందుకా? అమరావతిని స్కాం క్యాపిటల్‌గా మార్చినందుకా? ఏ విషయంలో జనం సంతృప్తిగా ఉన్నారు?. నాడు వైఎస్సార్ అంటే ఆరోగ్యశ్రీ, రెండు రూపాయలకు కిలో బియ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత కరెంట్ లాంటి పథకాలు గుర్తొచ్చేవి. మరి చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఏమైనా ఉందా? ఏ ముఖ్యమంత్రి పాలననైనా ప్రజలు పొగుడుతారు కానీ చంద్రబాబు మాత్రం తనను తానే పొగుడుకుంటారు. ప్రజలంతా సంతోషంగా ఉంటే వెంటనే ఎన్నికలకు వెళదాం. టీడీపీ సిద్ధమేనా?

నాడు హరికృష్ణతో రాజీనామా చేయించారుగా:

ఏపీకి చెందిన అందరు ఎంపీలూ రాజీనామాలు చేసి ఉంటే ఈపాటికి కేంద్రం దిగివచ్చేది. కానీ చిత్తశుద్ధిలేని చంద్రబాబు తన ఎంపీలతో రాజీనామాలు చేయించరు. ఢిల్లీలో డ్రామాలు చేసి, రాజీనామాలు చేయకుండా వచ్చిన టీడీపీ ఎంపీలను ప్రజలంతా తరిమికొట్టాలి. నాడు సమైఖ్యాంధ్ర ఉద్యమంలో భాగంగా నందమూరి హరికృష్ణతో రాజీనామా చేయించిన చంద్రబాబు.. ఇవాళ తన బినామీ సుజనా చౌదరితో ఎందుకు చేయించలేదు? హోదా కోసం ఆందోళనలు చేస్తోన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులతో అడ్డగించడం సిగ్గుచేటుకాదా? మీరు 30 సార్లు ఢిల్లీకి వెళ్లింది నియోజకవర్గాల పెంపు కోసం కాదా? అని ప్రశ్నించారు.

# చైనాను అధిగమించి.. తొలి స్థానానికి భారత్

దిల్లీ: కామన్‌వెల్త్ దేశాల నుంచి అత్యధిక విదేశీ పెట్టుబడులు ఆకర్షించిన దేశంగా భారత్ గుర్తింపు పొందింది. 53 దేశాల కూటమిలో ఎఫ్‌డీఐలకు బ్రిటన్ తర్వాత రెండో అతిపెద్ద వనరుగా నిలిచింది. ఈనెల 16 నుంచి 18 వరకు లండన్‌లో కామన్‌వెల్త్ దేశాల అధినేతల సదస్సు జరగనున్న తరుణంలో కామన్‌వెల్త్ వాణిజ్య సమీక్ష - 2018 పేరిట విడుదల చేసిన నివేదిక ద్వారా ఈ మేరకు వెల్లడైంది. సేవల రంగం విషయంలో కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, బ్రిటన్‌ను వెనక్కి నెట్టి భారత్ అగ్రగామిగా నిలిచింది. 2015-16 మధ్య కామన్‌వెల్త్ దేశాల నుంచి భారత్‌కు అత్యధిక స్థాయిలో గ్రీన్‌ఫీల్డ్ ఎఫ్‌డీఐలు వచ్చినట్లు కూటమి విడుదల చేసిన నివేదిక ద్వారా తేలింది. 2015లో గ్రీన్‌ఫీల్డ్ ఎఫ్‌డీఐలను ఆకర్షించడంలో చైనాను అధిగమించి భారత్ తొలిస్థానానికి చేరినట్లు వెల్లడైంది. భారత ఆర్థిక వృద్ధి ఇచ్చే ఊతంతో 2020 నాటికి సభ్య దేశాల మధ్య వాణిజ్యం విలువ 70వేల కోట్ల డాలర్లకు చేరుతుందని చోగామ్ సదస్సుకు ముందు విడుదల చేసిన నివేదికలో కామన్‌వెల్త్ కూటమి అంచనా వేసింది.




